ప్రజాశక్తి

శుక్రవారం 8 ఆగస్టు 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

విషాదం

సిలిండర్ పేలి ముగ్గురు మృతి

మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

వన్‌టౌన్‌లోని ఫిషింగ్ హార్బర్ నేవల్ క్యాంటీన్‌కు వెళ్లే మార్గంలో హిమాలయ బార్ పక్కన ఉన్న గ్యాస్ వెల్డింగ్ షాపులో గురువారం సిలిండర్ పేలిన ఘటనలో ముగ్గురు మృతిచెందారు. వెల్డింగ్ షాప్ యజమాని చల్లా గణేష్ (45), బుక్కా వీధికి చెందిన శ్రీను (32) అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన బుక్కా వీధికి చెందిన సిహెచ్.ముత్యాలు (27) కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. మధురవాడ మిథిలాపురి కాలనీకి చెందిన ఎర్ర ఎల్లాజీ (45), ఆరిలోవ రాజీవ్‌నగర్‌కు చెందిన టి.సన్యాసిరావు (46), ఎవిఎన్ కాలేజీ సమీపంలోని చెంగళరావుపేటకు చెందిన ఇప్పిలి రంగారావు (53) తీవ్ర గాయాలపాలై కెజిహెచ్లఓ చికిత్స పొందుతున్నారు. పేలుడు ధాటికి షెడ్డు చెల్లాచెదురైంది.

ప్రమాద వార్త తెలియగానే ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం కెజిహెచ్‌కు వెళ్లి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చితో కలిసి పరామర్శించారు.

గాయపడిన వారి పరిస్థితి ఆందోళనకరం

సిలిండర్ పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడిన వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి గురువారం రాత్రి మీడియాకు తెలిపారు. వీరిలో 95 శాతం కాలి, ఒక కాలుకు తీవ్రంగా గాయమైన సిహెచ్ ముత్యాలు (27) మృతిచెందినట్లు చెప్పారు. ఎర్ర ఎల్లాజీ, ఇప్పిలి రంగారావుకు 95 శాతానికి పైగా కాలిన గాయాలు ఉన్నాయని, వీరిని బరన్ వార్డుకు తరలించామని చెప్పారు. టి.సన్యాసిరావు కాలి గాయాలు 18 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, ఆయన శరీరంలో పలుచోట్ల ఎముకలు పూర్తిగా విరిగిపోయి, ఆందోళనకరంగా ఉందని వివరించారు. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచి క్షతగాత్రులందరికీ వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.

పేలుడు ప్రాంతంలో సహాయక చర్యలు

రోధిస్తున్న బంధువులు

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి : సిపిఎం

గ్యాస్ సిలిండర్ ప్రమాదంలో చనిపోయిన, క్షతగాత్రులైన

మిగతా 2లో..

మెట్రో రైలు విస్తరణకు భూసేకరణ

జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో మెట్రో రైల్, రైల్వేలైన్ విస్తరణ, గ్యాస్ పైప్ లైన్ ప్రాజెక్టులకు భూ సేకరణను వేగవంతం చెయ్యాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలక్టరేట్‌లో మెట్రోలైన్, సాధారణ రైల్వే లైన్ విస్తరణ, గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పైప్ లైన్ భూ సేకరణపై కలెక్టర్ గురువారం సమీక్ష చేసి మార్గదర్శకాలు జారీచేశారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ, ప్రాజెక్టులకు భూ సేకరణ చేయుటతోపాటు, పరిహారం కూడా త్వరగా అందించాలని చెప్పారు. పెందుర్తి, సింహాచలం నార్త్ స్టేషన్ మధ్యలో నిర్మించాల్సిన ఫ్లై ఓవర్, దువ్వాడ సింహాచలం లైన్ల మధ్యలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు సంబంధించిన భూ సేకరణపై సంబంధిత అధికారులతో చర్చించారు. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్ట్ ఫేజ్ 1లో భాగంగా మూడు కారిడార్లలో చేపట్టనున్న పనులకు సంబంధించి ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఎంజాయ్ మెంట్ సర్వే నిర్మాణాల విలువను రైల్వే చట్టం ప్రకారం పూర్తి చేయాలని చెప్పారు. భూ సేకరణలో నిబంధనలను అనుసరించి వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలన్నారు. కాలపరిమితిని దృష్టిలో పెట్టుకొని పనులు చేపట్టాలని సూచించారు. ఇంకా మిగిలి ఉన్న ఐఒసి గ్యాస్ పైప్ లైన్ల ఏర్పాటుకు జివిఎంసి, విఎంఆర్‌డిఎతో అధికారులు సహకరించి పెండింగ్ ఉన్న అనుమతులు త్వరగా ఇవ్వాలన్నారు. జివిఎంసి పరిధిలో కౌన్సిల్ అనుమతి పొంది పరిహారం ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని జివిఎంసి అధికారులకు సూచించారు. నరవ గ్రామంలో భూ సేకరణ నూరుశాతం సర్వే పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ బిహెచ్.భవానీప్రసాద్, ఆర్‌డిఒ సంగీత మాదూర్, శ్రీలేఖ, భూ సేకరణ అధికారులు, తహశీల్దారులు, ఇఒసిఎల్, మెట్రో రైల్, రైల్వే జివిఎంసి అధికారులు పాల్గొన్నారు.

కన్వేయన్స్ డీడ్ పట్టాలకు రిజిస్ట్రేషన్లు

వివిధ మార్గాల్లో కన్వేయన్స్ డీడ్ పట్టాలు పొందిన లబ్ధిదారులకు త్వరితగతిన రిజిస్ట్రేషన్లు చేయాలని జోనల్, మండల స్థాయి రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఇటీవల ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒలు 30, 45ల ద్వారా నిర్వహిస్తున్న భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియతో పాటు వీటికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భీమిలి, విశాఖపట్టణం డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులతో కలెక్టరేట్ మీటింగు హాలులో గురువారం నిర్వహించిన

మిగతా 2లో..

నేటి నుండి ఆంధ్ర ప్రీమియర్ లీగ్

- కాకినాడ కింగ్స్ - అమరావతి రాయల్స్ మధ్య తొలి మ్యాచ్
- ముఖ్య అతిథులుగా హాజరుకానున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, సినీ నటుడు వెంకటేష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: విశాఖ వేదికగా ఆంధ్ర ప్రీమియర్ లీగ్ శుక్రవారం ప్రారంభమవుతుందని ఎపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ వెంకట సుజయ్‌కృష్ణ రంగారావు తెలిపారు. ఎసిఎ - విడిసిఎ మైదానంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎపిఎల్ - 2025 సీజన్ - 4 వివరాలను వెల్లడించారు. ఎపిఎల్ సీజన్ - 4 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ ఏడాది 6 టీమ్స్ నుండి 7 టీమ్స్‌కు పెంచినట్లు చెప్పారు. అండర్ -16లో ప్రతిభ చూపిన వారికి ఈసారి అవకాశం ఇచ్చినట్లు వివరించారు. సుమారు 500 మంది క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ఇది ఒక సువర్ణ అవకాశం అని తెలిపారు. ప్రొఫెషనల్‌గా నిర్వహించాలనే ఉద్దేశంతో ఈసారి పోటీలకు ఎంపైరింగ్ విభాగంలో డిఆర్ఎస్ విధానాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు విజేతకు ప్రైజ్ మని రూ.35 లక్షలకు పెంచామని, రన్నరప్‌కు రూ.20 లక్షలు, ప్రతి మ్యాచ్, వ్యక్తిగత విభాగంలోను బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఈ పోటీలకు బ్రాండ్ అంబాసిడర్‌గా సినీ నటుడు దగ్గుపాటి వెంకటేష్ వ్యవహరిస్తారని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు హాజరవుతారని చెప్పారు. ఈ పోటీలను చూసేందుకు విశాఖ వాసులకు ప్రవేశం ఉచితమన్నారు. ఈ మ్యాచ్‌లను సోని స్పోర్ట్స్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుందని తెలిపారు. శుక్రవారం ప్రారంభమయ్యే ఈ మ్యాచ్‌లు ఈ నెల 23వ తేదీ వరకు జరుగుతాయని వివరించారు.

నిర్బంధం ప్రయోగించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

3వ పేజీ

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

ది సాయి భీమిలి మ్యూచ్‌వల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ త్రిఫ్ట్ & క్రెడిట్ సొసైటీ లిమిటెడ్

Regd.No. AMC/VSP/DCO/2013/3009 E-Mail : bheemilimacs@gmail.com

అనిల్‌రాజా కాంప్లెక్స్, పాతబస్టాండ్, భీమునిపట్నం-531163. విశాఖ జిల్లా.

హెడ్ ఆఫీస్ : భీమిలి సెల్ : 9985 628 628

బ్రాంచ్ ఆఫీస్ : రేవిడి సెల్ : 768 0918 628

బ్రాంచ్ ఆఫీస్: తగరపువలస సెల్ : 7095 828 628

బ్రాంచ్ ఆఫీస్: అనంతవరం సెల్:7330 828 628

బ్రాంచ్ ఆఫీస్: మజ్జివలస సెల్:7416 528 628

మెయిన్ బ్రాంచి నందు లాకర్ సదుపాయం కలదు.

లోన్లు : గోల్డ్ లోన్స్, బిజినెస్ లోన్స్ మార్టిగేజ్ లోన్స్

డిపాజిట్లు : సేవింగ్స్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు క్యుములేటివ్ డిపాజిట్లు డైలీ డిపాజిట్లు

కొమ్మినేని ఎర్రునాయుడు చైర్మన్,
(Retd DCCB Branch Manager)
సెల్: 9492500060

ఖాతా	కాలపరిమితి	సాధారణ	సీనియర్ సిటిజన్
సేవింగ్స్		6%	---
టెర్మ్‌డిపాజిట్	91-180 రోజులు	8%	---
	181-1 సంవత్సరం	9%	9.5%
	1 సంవత్సరం-3 సంవత్సరాలు	10.5%	11%
	3 సంవత్సరం - 6 సంవత్సరాలు	11%	11.5%
	6 సంవత్సరం పైబడి	12%	12.5%

మొదటి పేజీ తరువాయి..

విషాదం

వారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, చనిపోయిన వారి కుటుంబాలకు రూ.50 లక్షలు నష్ట పరిహారం ప్రకటించాలని, తీవ్రంగా గాయాల పాలై చావు బతుకులతో ఉన్న వారికి మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్‌చేశారు. సంఘటన జరిగిన ప్రాంతాన్ని సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, జగదాంబ జోన్ కన్వీనర్ ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్ సందర్శించారు. బాధితులను పరామర్శించారు. కెజిహెచ్‌కు వెళ్లి గాయపడిన వారిని పరామర్శించారు.

మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని ఎపి మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు.

మెట్రో రైలు విస్తరణకు భూసేకరణ

సమావేశంలో వివిధ అంశాలపై సమీక్షించిన ఆయన పలు మార్గదర్శకాలు జారీ చేశారు. జిఒ 27 ప్రకారం ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, జిఒ 30 ద్వారా ఆక్రమణల క్రమబద్ధీకరణ తాజా స్టేటస్ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిఒ 296 ప్రకారం వివిధ రూపాల్లో పట్టాలు పొందిన లబ్ధిదారులకు ఇంత వరకు చేసిన రిజిస్ట్రేషన్ల గురించి ఆరా తీశారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్నింటికి పరిష్కారం చూపారు అనే అంశాలపై సమీక్షించారు. కన్వేయన్స్ డీడ్ పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, రోజు 30 రిజిస్ట్రేషన్ల చేయాలనే లక్ష్యంతో ప్రతి తహశీల్దార్ పనిచేయాలని ఆదేశించారు. మొత్తం ప్రక్రియను రెండు నెలల్లో పూర్తి చేయాలని నిర్దేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్ భవానీ శంకర్, విశాఖ, భీమిలి ఆర్‌డిఒలు పి.శ్రీలేఖ, సంగీత్ మాధుర్, పలువురు తహశీల్దార్లు, ల్యాండ్ సెక్షన్, యుఎల్ సి విభాగాల అధికారులు పాల్గొన్నారు.

'ఉచిత బస్సు'పై సమీక్ష

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వం ఈ నెల 15 నుండి ప్రారంభించనున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంపై ఎపిఎస్‌ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్ల నారాయణ, జోనల్ చైర్మన్ దొన్నుదొర, మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు ఆధ్వర్యాన గురువారం ద్వారకా బస్సు స్టేషన్‌లో జోన్-1 పరిధిలో అన్ని జిల్లాల అధికారులు, డిపో మేనేజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకోసం అదనపు బస్సులను, సిబ్బందిని సమకూర్చుకున్నట్లు తెలిపారు. పథకం అమలు నేపథ్యంలో తొలి రోజుల్లో ఎదురయ్యే సమస్యలను పరిగణనలోకి తీసుకొని దిద్దుబాటు చేసుకొంటూ ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. జోనల్ చైర్మన్ దొన్నుదొర మాట్లాడుతూ, బస్సులలో ఓవర్ లోడ్ సమస్యను అధిగమించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఆర్‌టిసి ఎమ్‌డి సిహెచ్ ద్వారకాతిరుమలరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో మహిళలు ఎక్కడి నుండి ఎక్కడికైనా ఆర్‌టిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు.

ఘనంగా సూర్యనారాయణ సంస్మరణ సభ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సిఐటియు విశాఖ జిల్లా పూర్వ అధ్యక్షులు ఎం.సూర్యనారాయణ 11వ వర్థంతిని జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో గురువారం నిర్వహించారు. సూర్యనారాయణ చిత్రపటానికి సిఐటియు, కెవిపిఎస్ జిల్లా నాయకులు కుమారమంగళం, వైటి.దాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, సూర్యనారాయణ అతి నిరుపేద వ్యవసాయ కార్మిక కుటుంబంలో జన్మించి, విద్యార్థి దశలోనే వామపక్ష ఉద్యమాల పట్ల ఆకర్షితుడై ఎస్ఎఫ్ఐలో చేరి విద్యార్థి సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. కృష్ణా కాలేజీలో చదువుతూ హాస్టల్ విద్యార్థుల సమస్యలపై పెద్దయెత్తున పోరాడారన్నారు. జిల్లా వ్యాప్తంగా సైకిల్ యాత్ర నిర్వహించి విద్యార్థులను చైతన్య పరిచారని తెలిపారు. తదనంతరం సిపిఎంలో క్రియాశీల, పూర్తికాలం కార్యకర్తగా చేరి ఉద్యమ అవసరాల రీత్యా కెవిపిఎస్ బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. అనంతరం ఏజెన్సీ ప్రాంతాలో గిరిజన ఉద్యమ అవసరాల రీత్యా పాడేరు వెళ్లి అక్కడ మారు మూల గిరిజన తండాల్లో ఆదివాసీలు ఎదుర్కొనే అనేక సమస్యలపై వారిని చైతన్య పరచి వారి ఆదరాభిమానాన్ని పొందారన్నారు. ఈ సంస్మరణ సభలో వై.రాజు, ఒ.అప్పారావు, జివిఎన్.చలపతి, ఎం.సూరీడు, ప్రదీప్, వి.భారతి, కె.నరసింగరావు, పట్టాభి, ఎం.సుబ్బన్న, టి.చిరంజీవి, పైడితల్లి, పెంటరావు, శివ,కుమారి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులపై నిర్బంధం తగదు : సిఐటియు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పీస్ రేట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం చేపట్టిన చలో విజయవాడ విద్యుత్ సౌదా కార్యక్రమంపై నిర్బంధాన్ని సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఖండించారు. ఈ కార్యక్రమం జరగకుండా కూటమి ప్రభుత్వం ఎక్కడకక్కడ కార్మికుల్ని ముందస్తు అరెస్టులు, గృహనిర్బంధాలు, విజయవాడ రాకుండా అడ్డుకోవడం, వచ్చిన వారిని వచ్చినట్టే అరెస్టులు చేసి బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించడాన్ని తీవ్రంగా ఖండించారు.

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని, జీతభత్యాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, పీస్ రేటు విధానాన్ని రద్దుచేసి నెలవారి జీతాలు చెల్లిస్తామని కూటమి నాయకులు ఎన్నికమల ముందు హామీ ఇచ్చిందని, నేటికీ ఆ హామీలు అమలు చేయకపోవడంతో కార్మికులు చలో విజయవాడకు తరలివచ్చారన్నారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించవలసిన ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి దమనకాండకు దిగడం దుర్మార్గమని పేర్కొన్నారు. అరెస్టు చేసిన వారందరినీ బే షరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

స్టాడింగ్ కమిటీ ఎన్నికలో క్రాస్ ఓటింగ్‌కు మేయరే కారణం

జనసేన కార్పొరేటర్ మహమ్మద్ సాదిక్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : స్టాండింగ్ కమిటీ ఎన్నికలలో క్రాస్ ఓటింగ్ జరిగి కూటమి ప్రతిష్టకు భంగం కలగడానికి మేయర్ పీలా శ్రీనివాసరావు కారణం అని 39వ వార్డు జనసేన కార్పొరేటర్ మహమ్మద్ సాదిక్ ఆరోపించారు. గురువారం మేఘాలయ హోటల్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్పొరేటర్లు, మేయర్ మధ్య సమన్వయ లోపం ఉందన్నారు. మేయర్‌గా భాద్యతలు చేపట్టాక పీలా తన అసలు రంగు బయటపెడుతున్నారని విమర్శించారు. స్టాడింగ్ కమిటీ ఎన్నికలకు కూటమి ప్రభుత్వం పనితీరుకు ఎటువంటి సంబంధమూ లేదన్నారు. పీలా శ్రీనివాసరావు ప్రవర్తన నచ్చక కొంతమంది కార్పొరేటర్లు తమ అసంతృప్తిని స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వ్యక్తంచేశారని తెలిపారు. ఇది పూర్తిగా మేయర్‌కు వ్యతిరేకమైన ఓటుగా మాత్రమే చూడాలి గాని వైసిపి నేతలు మాట్లాడ్తున్నట్లు కూటమి ప్రభుత్వ పనితీరుతో సంబంధం లేదని స్పష్టం చేశారు.

జివిఎంసి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్‌కు అవగాహన

జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : గ్రీన్ ఆంధ్ర సమ్మిట్ 2025లో 'గ్రీన్ క్రూసేడ్' కార్యక్రమం సిఐఐ, ఐజిబిసి సహకారంతో హరిత అభివృద్ధి వైపు అడుగులకు జివిఎంసి ఒప్పందం కుదుర్చుకుందని జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 7న విజయవాడలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) - ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజిబిసి) నిర్వహించిన గ్రీన్ ఆంధ్ర సమ్మిట్ 2025 కు జివియంసి కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశాల మేరకు జివిఎంసి అదనపు కమిషనర్ ఎస్-ఎస్ వర్మ, పర్యవేక్షక ఇంజినీర్ శ్రీనివాసరావు, హాజరయ్యారు. మంత్రి డాక్టర్ పి.నారాయణ, ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ ,ఐజిబిసి, సిఐఐ ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమ్మిట్‌లో, జివిఎంసి ప్రాజెక్టుల నుండి స్థిరమైన మౌలిక సదుపాయాలు హరిత అభివృద్ధిని ప్రోత్సహించడానికి సహకార ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటు చేయడానికి జివిఎంసి ఐజిబిసి అవగాహన ఒప్పందంపై సంతకం చేసినట్లు కమిషనర్ తెలిపారు.

దేశభక్తి బృంద గానం పోటీలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రజానాట్యమండలి ఆధ్వర్యాన విద్యార్థులకు దేశభక్తి బృందగానం పోటీలను నిర్వహించారు. కంచరపాలెం డివిజన్ పరిధిలోని ఎన్ఎడి కొత్త రోడ్డు శ్రీ సరస్వతి విద్య విహార స్కూల్లో పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు లక్ష్మీనారాయణ, లీలావతి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఒ.విజయ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 6 పాఠశాలల విద్యార్థులు బృందగానాలు పాడారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు జి.రమణ మాట్లాడుతూ పిల్లల్లో దేశభక్తి భావం, మత సామరస్యం, ఐక్యమత్యంతో ఉండటం, సోదరభావాన్ని పెంపొందించడం కోసం దేశభక్తి గీతాలాపన జిల్లా అంతటా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నాయకులు సిహెచ్ సూర్యనారాయణ, ఎన్ఎన్ మౌలాలి, పాల్గొన్నారు.

ప్రజానాట్యమండలి మద్దిలపాలెం జోన్ ఆధ్వర్యాన రాణి మెమోరియల్ హైస్కూల్లో ఈ పోటీలు నిర్వహించారు. 5 పాఠశాలల నుండి 60 మంది విద్యార్థులు పాల్గొని దేశభక్తి గీతాలు ఆలాపించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా రిటైర్డ్ సిఐ విశ్వేశ్వరరావు, డాక్టర్ క్రితా కరుణి, ఎన్.పద్మావతి వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పిల్లలలో ఉన్న శక్తి సామర్థ్యాలను, వెలికి తీసి మంచి గాయకులుగా, కళాకారులుగా తర్ఫీదును ఇచ్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఫౌండర్ రంగారావు, రవి భూషణ్, రఘు, పిఎన్ఎం నాయకులు ఎన్‌వి.రమణ, ఐద్వా నాయకులు కె.కుమారి పాల్గొన్నారు.

లీగల్ సర్వీసెస్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపికాలనీ: ఎంవిపి.కాలనీలో జిల్లా సైనిక్‌బోర్డు ఏర్పాటు చేసిన లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు గురువారం ప్రారంభించారు. సైనికులకు, మాజీ సైనికులకు, వారి కుటుంబాలకు ఉచిత న్యాయ సలహాలు అందించడానికి ఏర్పాటుచేసినట్లు సన్యాసినాయుడు తెలిపారు. బుధ, శుక్రవారాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE 2nd ADDITIONAL DISTRICT JUDGE, CUM MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL, AT SRIKAKULAM
M.V.O.P. No 191/2024

Between:
Nuka Parvathi & Others ...Petitioners
And:
Korlam Chinnababu & 4 Others ....Respondents

To,
Respondent No-2:
Boddeti Srinivasa Rao, S/o. Appala Naidu, R/o. Door No. 6-13-8, L.B.S. Nagar, Drivers Colony, Gajuwaka, Visakhapatnam District - 530026, Owner of the LORRY (Heavy Goods Vehicle- HMV) TATA Motors Ltd., Vide Regd No. AP-35-V-8777.

NOTICE

Please take notice that the above matter stands posted on **14-08-2025** for your appearance before the court, therefore you are hereby directed to appear before the Honorable court on **14-08-2025 at 10.30 A.M.** either in person or through an Advocate, failing which the matter will be decided in your absence.

CH. KRISHNA RAO (KRISHNA MOHAN)
ADVOCATE,
SRIKAKULAM,
CELL: 9949731123

IN THE HON'BLE COURT OF THE X ADDL. DISTRICT JUDGE cum M.A.C.T. AT: ANAKAPALLE
M.O.P. 573/2024

Between:
Topalli Kamala Satya Surya Prabhavathi ...Petitioner
And:
Sri Jommala Nooka Raju & 3 others ...Respondents

NOTICE

To,
R-1: Sri Jommala Nooka Raju,
S/o. Demudu, Aged 52 years, R/at Venkannapalem Village, Chodavaram Mandalam, Anakapalli District
Please take notice that the above named petitioner herein has filed the above M.O.P. against you and other respondents claiming compensation and the matter stands posted to **22-08-2025** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **22-08-2025** at **10:30 A.M**. in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.
(By Order of the Hon'ble Court)
M. MAHESWARA RAO,
Advocate
Visakhapatnam,
Cell: 9849429787.

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P. 37/2023 O.S. 330 / 2022

DHR: సర్వసిద్ధి నూకరాజు
JDR: మామిడి సత్యన్నారాయణ
To
JDR: మామిడి సత్యన్నారాయణ,
తండ్రి అప్పారావు, R/o.గుర్రాజుపేట గ్రామం H/o. గుడివాడ, ఎస్.రాయవరం మండలం, విశాఖపట్నం జిల్లా.

నోటీసు

పై నెంబరు అమలులో JDRకు ఎన్నిమార్లు O.21 R.54 ప్రకారం శ్రీ కోర్టు వారు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున, శ్రీ కోర్టు వారు ఆర్డరు ప్రకారం పేపరు పబ్లికేషన్ మూలకంగా O.21 R.54 నోటీసు జారీ చేస్తూ, అటు పిమ్మట ఈ అమలు పిటిషన్‌లో చూపిన షెడ్యూల్డు ఆస్తి జప్తు చేస్తూ, వాయిదా తేది: 29-8-2025 తెలియజేస్తూ.

(శ్రీకోర్టు వారు ఉత్తర్వులు ప్రకారం)
యల్లపు నాగేశ్వరరావు
అడ్వకేటు
యలమంచిలి.
సెల్: 9553383837

యలమంచిలి
తే:7-8-2025

మహారాజశ్రీ 13వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, గాజువాక
G.O.P.No. 13/25

శ్రీమతి తిరుమలనేడి మంగ (మైనర్లు తిరుమలనేడి సూర్యవెంకట పునీత్, తిరుమలనేడి కౌమారి దేవి) . . . పిటిషనర్
మరియు:
నిల్ . . . రెస్పాండెంట్

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా తిరుమలనేడి మంగ భర్త (లేటు) సూర్యప్రకాశరావు మరియు వారి యొక్క మనవడు, మనుమరాలు తిరుమలనేడి సూర్యవెంకట పునీత్ (11 సంII), తిరుమలనేడి కౌమారదేవి (4సంII) మైనర్లు అయినందున వారి తరపున సదరు తిరుమలనేడి మంగను గార్డియన్‌గా నియమించమని కోరుతూ పిటిషన్ దాఖలు చేసియున్నారు. ఈ విషయంలో ఎవరికైననూ అభ్యంతరాలు ఉన్న యెడల పై కోర్టు ఎదుట **04-09-2025న ఉదయం 10-30నిIIలకు** వ్యక్తిగతంగా గానీ న్యాయవాది ద్వారా గానీ హాజరై వారి ఆక్షేపణలను తెలియచేయవలసినదిగా లేనిఎడల పై పిటిషన్‌ను వారి పరోక్షమున విచారణ జరుపబడునని ఇందుమూలంగా తెలియపరచడమైనది.

డి.వి.రామారావు
కొమ్మిరెడ్డి నాగదేవి
సిహెచ్.తిరుమలరాహుల్
అడ్వకేట్స్, గాజువాక. సెల్: 9246659656

ప్రకటన
శ్రీ యలమంచిలి ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O. S. 257/2024

వాది : శ్రీమతి దారబోయిన గంగమ్మ
ప్రతివాది : శ్రీ సబ్బి అప్పలరాజు
ప్రతివాది : సబ్బి అప్పలరాజు S/o నూకరాజు లక్ష్మీపతిరాజుపేట, గుడివాడ గ్రామ శివారు, S. రాయవరం మండలం, అనకాపల్లి జిల్లా

పై నెంబరు దావాలో దావా పరిహారం నిమిత్తం వాది మీపై దావా దాఖలు చేయగా కోర్టవారి ఉత్తర్వులమేరకు మీకు అనేకపర్యాయములు సమను/నోటీసులు పంపినను మీరు బుద్ధిపూర్వకముగా సదరు సమను/ నోటీసు లు తీసుకోకుండా తప్పించుకు తిరుగుచున్నారనిను, అందువలన పేపరు ప్రకటన ద్వారా మీకు సమను/నోటీసులు అమలు చేయుమని వాది కోరినందున కోర్టువారు ఉత్తర్వులు ఇచ్చినారు. సదరు ఉత్తర్వుల ప్రకారము వాది వేయించిన పేపరు ప్రకటన చూసుకొని మీరు **తే.22-08-2025న ఉదయం గం.10-30లకు** పై కోర్టువారి ముందు స్వతహాగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ తాలూకు ఆక్షేపణలు తెలియజేయగలరు లేని ఎడల పై నెంబరు వ్యాజ్యమును మీ పరోక్షమందు తీర్మానించడమగునని మీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
తల్ల సత్యనారాయణ, న్యాయవాది,
సెల్ : 9441341423, ప్లాట్ నెంబర్.105
మామిడి ఎంక్లేవ్, గాంధీనగర్,
యలమంచిలి.

చుక్కల్లో పూల ధరలు

జనాలతో కిటకిటలాడుతున్న నగరంలోని పూర్ణామార్కెట్

- శ్రావణమాసం, వరలక్ష్మివ్రతం నేపథ్యంలో ఆకాశంలో పూజా ద్రవ్యాల రేట్లు
- జనాలతో కిక్కిరిసిన నగరంలోని మార్కెట్లు
- రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

ప్రజాశక్తి- ఆనందపురం: శ్రావణ మాసం మూడో శుక్రవారం, వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని గురువారం ఆనందపురం మండలంలోని వేములవలస మహాత్మా గాంధీ రోజువారీ పూల మార్కెట్ శోభాయమానంగా మారింది. ఉత్తరాంధ్రలోనే అతి పెద్ద పూల మార్కెట్‌గా ప్రసిద్ధి గాంచిన ఈ మార్కెట్‌కు విశాఖపట్నం, అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి భారీగా పూల వ్యాపారులు, వినియోగదారులు తరలివచ్చారు. శ్రావణ మాసం ప్రారంభమైనప్పటి నుంచే పూలకు భారీ డిమాండ్ ఏర్పడింది. దీంతో ధరలు ఐదురెట్లు పెరిగాయి. ప్రస్తుతం మల్లె, విరజాజుల ధర కిలోకు రూ.2,000గా ఉండగా, గులాబీ, చామంతి పూలు రూ.800 నుంచి రూ.1,000 వరకు విక్రయించబడుతున్నాయి. ధరల పెరుగుదలతో సామాన్యులు పూలు కొనలేని పరిస్థితి ఏర్పడింది. పూజలు, వ్రతాల నిర్వహణలో ఇబ్బందులు పడుతున్నామని సామాన్యభక్తులు వాపోతున్నారు.

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

పూల కొనుగోలుకు భారీగా జనం రావడంతో మార్కెట్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ తీవ్రంగా నిలిచిపోతోంది. రోడ్డుపైనే పూల వ్యాపారాలు నిర్వహించడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.. ముఖ్యంగా విశాఖపట్నం, పెందుర్తి మార్గంలో ప్రయాణించే వాహనదారులు రోడ్డుపక్కనే వాహనాలు నిలిపి పూలు కొనుగోలు చేయడంతో ఇతర వాహన రాకపోకలకు ఆటంకమేర్పడింది.

డిమాండ్ రోజుల్లో ధరల నియంత్రణకు డిమాండ్

హోల్‌సేల్ ధరలకే క్రయవిక్రయాలు సాగే వేములవలస పూలమార్కెట్‌లో శ్రావణమాసం పురస్కరించుకుని పూల ధరలు అడిగిన క్రేత కంటే అనేక రెట్లు అమాంతం పెంచడంతో ప్రజలు అవాక్కయ్యే పరిస్థితి ఉంది. రైతుల నుంచి మామూలు ధరలకే కొనుగోలు చేసినప్పటికీ, పండుగ డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలు పెంచేశారు. ఈ నేపథ్యంలో పండగల్లో పూల ధరల దోపిడి జరగకుండా ధరల నియంత్రణకు ప్రభుత్వపరంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

జనసంద్రంగా పూర్ణామార్కెట్

శ్రావణమాస వేళ నగరంలోని పూర్ణా మార్కెట్‌తోపాటు పలు మార్కెట్లు పూజాసామగ్రి కొనుగోలుకు వచ్చిన జనాలతో కిటకిటలాడాయి. శుక్రవారం వరలక్ష్మి పూజలకు అవసరమయ్యే పండ్లు, పూలు, ఇతర సామగ్రి కొనుగోలుకు ప్రజలు మార్కెట్లకు వచ్చాయి. ఆకాశంటిన ధరలను చూసి అవాక్కయినప్పటికీ,పూజా ద్రవ్యాలు అవసరం కావడంతో అధిక ధరలిచ్చి కొనుగోలు చేయక తప్పదని పలువురు వాపోయారు. వరలక్ష్మీ వ్రతానికి అవసరమయ్యే లక్ష్మీదేవి కాసులతోపాటు ఆభరణాల కొనుగోలుకు వచ్చిన వారితో బంగారు దుకాణాలకు శ్రావణశోభ సంతరించుకుంది.

పూలు కొనేందుకు వచ్చిన వారితో వేములవలస మార్కెట్

నేరాలు ఘోరాలు

ఎనిమిది మంది జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలోని భీమన్న దొరపాలెం గ్రామ శివారులో ఓ బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.56,100 నగదు స్వాధీనపర్చుకున్నారు. పక్కాగా అందిన సమాచారం మేరకు స్థానిక ఎస్ఐ సంతోష్, టాస్క్‌ఫోర్స్ అధికారి ఎం. భరత్ కుమార్‌రాజు ఆధ్వర్యంలో పోలీసు బృందం జూదశిబిరంపై దాడిచేసింది. నిందితులపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ వైర్ల చోరీ నిందితులకు రిమాండ్

ప్రజాశక్తి-కశింకోట : ఎన్‌జి పేట గ్రామం శివారు పంట పొలాల్లో శారద నది ఒడ్డునున్న వ్యవసాయ కనెక్షన్ల విద్యుత్ వైర్లను అపహరించిన ముగ్గురిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. సిఐ స్వామినాయుడు తెలిపిన వివరాలివి. అనకాపల్లి మండలం సుబ్రహ్మణ్యం కాలనీకి చెందిన నక్క లచ్చి, నక్క డేనియల్, గంట భీమరాజు పక్షుల వేట పేరుతో పొలాల్లోకి వచ్చి వ్యవసాయ మోటార్ల విద్యుత్ వైర్లు కత్తిరించి, వాటిలోని కాపర్ వైర్లను తీసి స్క్రాప్ షాపులకు విక్రయిస్తున్నారు. తాజా ఘటనలో దొంగిలించిన కాపర్‌ను యలమంచిలిలోని స్క్రాప్ షాప్‌కు అమ్మేందుకు నిందితులు వెళ్తుండగా కశింకోట రైల్వేగేట్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు. దాడిలో పాల్గొన్న ఎస్ఐలు మనోజ్ కుమార్, లక్ష్మణ్‌రావు, హెడ్ కానిస్టేబుళ్లు సూర్యారావు, మధుబాబు, డి.శ్రీను, కానిస్టేబుళ్లు డి.గోపి, బి.శ్రీనివాస్, బి.మహేష్, వై.లక్ష్మణ్, ఎం.శ్రీను, ఎం.అప్పలరాజులను సిఐ స్వామినాయుడు అభినందించారు.

మూడు కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-దేవరాపల్లి : బైక్‌పై అక్రమంగా మూడు కేజీల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు యువకులను దేవరాపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఉదయం శ్రీరాంపురం వై.జంక్షన్ వద్ద ఎస్ఐ వి.సత్యనారాయణ నేతృత్వంలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా, విశాఖ కంచరపాలేనికి చెందిన చుక్క కార్తిక్, సబ్బవరానికి చెందిన చిట్టిబోయిన ఎర్రిబాబు వేలం మామిడి ప్రాంతంలో కొనుగోలుచేసిన గంజాయిని బైక్‌పై తెస్తుండగా, పోలీసులకు పట్టుబడ్డారు. మూడు కేజీల గంజాయితో పాటు, బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను చోడవరం కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

ప్రజాశక్తి-కోటవురట్ల : మనస్తాపానికి గురై మండలంలోని రాజుపేట శివారు రామన్నపాలెం గ్రామానికి చెందిన పల్లా సింహాచలం అలియాస్ చిలకమ్మ (66) ఇంటి వద్ద ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు.

చేనేతకు చేయూత

ప్రజాశక్తి -ములగాడ : భారతదేశ సాంస్కృతిక ప్రతిబింబమైన చేనేతకు చేయూతనివ్వవలసిన అవసరంఉందని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా సెయింట్ ఆన్స్ కళాశాలలో మాట్లాడుతూ, చేనేత వల్ల అనేకమంది గ్రామీణ మహిళలకు ఉపాధి లభిస్తోందన్నారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకురాలు లక్ష్మీదేవి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ప్రతిభ అద్భుతం

మాట్లాడుతున్న ఒడిశా గవర్నర్ కంభంపాటి

ప్రజాశక్తి - ఆనందపురం : ఆర్థిక విషయాల్లో మహిళలు అద్భుత ప్రతిభ చూపుతున్నారని, అందుకు విశాఖ మహిళా కోఆపరేటివ్ సొసైటీ ఒక నిదర్శనమని ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు ప్రశంసించారు. గురువారం గంభీరంలోని ప్రయివేటు హోటల్‌లో సొసైటీ రజతోత్సవ వేడుకల్లో మాట్లాడుతూ, 10 మంది సభ్యులతో ప్రారంభమైన మహిళా సొసైటీ నేడు 10 బ్రాంచ్‌లతో, రూ.100 కోట్ల వ్యాపార టర్నోవర్ సాధించడం గర్వకారణమన్నారు. చిరు వ్యాపారాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ ముద్ర రుణ పథకం బ్యాంకులు తగిన స్థాయిలో రుణాలు మంజూరు చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతికి అన్న ఎన్‌టిఆర్ ఆలోచనలు, నిర్ణయాలు మూలమన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, కోఆపరేటివ్ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతునిస్తోందని, విశాఖ మహిళా సంఘానికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తానని భరోసానిచ్చారు.కార్యక్రమంలో సొసైటీ చైర్‌పర్సన్ యలమంచిలి ప్రసూనాంబ, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్సీ వైవి.రాజేంద్ర ప్రసాద్, గుడివాడ అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు రావి వెంకటేశ్వరరావు, మహారాజా బ్యాంక్ చైర్మన్ ఎంఆర్‌కె.రాజు, యలమంచిలి వెంకటేశ్వరరావు బ్యాంక్ చీఫ్ మేనేజర్ మంజువాణి పాల్గొన్నారు.ఉత్తమ సేవలు అందించిన సొసైటీ ఉద్యోగులను సత్కరించారు.

ఉచిత విద్యుత్ పరిమితి పెంపుపై హర్షం

ప్రజాశక్తి- వేపగుంట : నాయీబ్రాహ్మణుల క్షవర దుకాణాలకు ఉచిత విద్యుత్తు వాడకాన్ని 150 యూనిట్లు నుంచి 200 యూనిట్లకు పెంచుతూ మంత్రివర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించడంపై నాయీ బ్రాహ్మణ సేవా సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు నరవ పైడిరాజు హర్షం వ్యక్తం చేశారు. 2019 ఫిబ్రవరి 6న అప్పటి టిడిపి ప్రభుత్వం జిఒ.15ద్వారా బార్బర్ షాప్‌లకు 150 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించగా, తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం నిర్వాకం వల్ల కొద్దిమందికే లబ్ధి చేకూరిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ మంత్రిమండలి ఉచిత విద్యుత్ వాడకాన్ని 200యూనిట్లకు పెంచడంపై సంతోషం వ్యక్తం చేశారు. నాయీ బ్రాహ్మణ సర్టిఫికెట్ ఉన్నవారికి మాత్రమే దీన్ని వర్తింపజేయాలని పైడిరాజు కోరారు. పాతికేళ్ల డిమాండ్‌ను ఎట్టకేలకు నెరవేర్చిన సిఎం చంద్రబాబు, మంత్రి గొట్టిపాటి రవికుమార్, బిసి శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యే గణబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

న్యాయవాదుల క్రీడా పోటీలు ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - విశాఖ లీగల్ : మనుషుల మధ్య సత్సంబంధాల బలోపేతానికి క్రీడలు దోహదం చేస్తాయని గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు. గురువారం సాయంత్రం స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా న్యాయవాదుల క్రీడా సాంస్కృతిక వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయవాదులకు ఆటవిడుపుగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అవసరం అన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదుల మధ్య సుహృద్భావ వాతావరణాన్ని కలిగించడానికి ఇటువంటి క్రీడలు, వేడుకలు దోహద పడతాయన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అధ్యక్షత వహించిన కార్యక్రమంలోబార్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిరిపురపు కృష్ణమోహన్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎంకే శ్రీనివాస్, కార్యదర్శి పార్వతీశ్వర నాయుడు, న్యాయవాదుల క్రీడా సాంస్కృతిక సంఘం కార్యదర్శి, జాతీయ స్విమ్మర్ బాలాజీ, సభ్యులు ఆడారి అప్పారావు బగాది తులసీదాస్ పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాద్రి అప్పన్న ఆర్జితసేవల్లో భాగంగా గురువారం నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు.ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేసిన అర్చకులు, విశేష పూజలు అనంతరం కంకణధారణ, జీలకర్ర, బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాల ప్రక్రియ వంటి కల్యాణ తంతునుకమనీయంగా జరిపించారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

వీఎంఆర్‌డిఎ స్పోర్ట్ మీట్ జెర్సీ ఆవిష్కరణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: వీఎంఆర్‌డిఎ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 9నుంచి ఉద్యోగులకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న స్పోర్ట్స్‌మీట్‌లో క్రీడాకారులు ధరించే జెర్సీని సంస్థ చైర్మన్ ఎంవి.ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కెఎస్‌విశ్వనాథన్ ఆవిష్కరించారు. సంస్థ ఉద్యోగులకు క్రికెట్, వాలీబాల్, చెస్, క్యారమ్స్, బాడ్మింటన్ తదితర పోటీలు నిర్వహిస్తున్నామన్నారు కార్యక్రమంలో కార్యదర్శి మురళీకృష్ణ, వెంకటేశ్వరరావు, రవికుమార్ పాల్గొన్నారు.

19న ఫోటో జర్నలిస్టుల ఎగ్జిబిషన్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: విశాఖ ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19, 20వ తేదీల్లో నిర్వహించే ఫోటో ఎగ్జిబిషన్ పోస్టర్‌ను జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వై.రామకృష్ణ, కార్యదర్శి ఎండి.నవాజ్ శరత్, వేణు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ సభ్యులకు అభినందన

ప్రజాశక్తి -గోపాలపట్నం : జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించిన కార్పొరేటర్లు గురువారం విశాఖ పశ్చిమ నియోజకవర్గం కార్యాలయంలో ఎమ్మెల్యే గణబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు రాపర్తి కన్నా, ముల్లి ముత్యాల నాయుడు, దాడి వెంకట రమేష్‌లను ఎమ్మెల్యే గణబాబు సన్మానించారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు గల్లా చిన్న, శరగడం రాజశేఖర్, బొమ్మిడి రమణ తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రకటన

శ్రీ యలమంచిలి ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

I.A.799/2024 O. S. 257/2024

పిటీషనరు/వాది : శ్రీమతి దారబోయిన గంగమ్మ

రెస్పాండెంటు/ప్రతివాది : శ్రీ సబ్బి అప్పలరాజు

రెస్పాండెంటు/ ప్రతివాది : సబ్బి అప్పలరాజు S/o నూకరాజు లక్ష్మీపతిరాజుపేట, గుడివాడ గ్రామశివారు, S.రాయవరం మండలం, అనకాపల్లి జిల్లా

ఈ నోటీసు అందిన 48 గంటల లోగా దావా బాకీ సరియగు హామీని మీరు ఇవ్వని పక్షములో మీ తాలూకు షెడ్యూల్ ఆస్తి ని ముందస్తు జప్తు ఎందుకు చేయకూడదో మీ అభ్యంతరము తెలుపుటకు గాను పిటీషనరు మీపై పై నెంబరు పిటీషను దాఖలు చేయగా కోర్టువారి ఉత్తర్వులమేరకు మీకు అనేకపర్యాయములు నోటీసులు పంపినను మీరు బుద్ధిపూర్వకముగా సదరు నోటీసులను తీసుకోకుండా తప్పించుకు తిరుగుచున్నారనిను, అందువలన పేపరు ప్రకటన ద్వారా పై నెంబరు పిటీషనులోజప్తుకు గల మీ అభ్యంతరము తెలుపుటకు కారణము వివరించుటకే నిమిత్తం మీ పై నోటీసులు అమలు చేయమని కోర్టువారు ఉత్తర్వులు ఇచ్చినారు. సదరు ఉత్తర్వుల ప్రకారము పిటీషనరు వేయించిన పేపరు ప్రకటన చూసుకొని మీరు తే. 22-08-2025 న ఉదయం గం. 10-30 లకు పై కోర్టువారి ముందు స్వతహాగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై సదరు పిటీషనులో మీ తాలూకు ఆక్షేపణలు తెలియజేయవలెను లేని ఎడల పై నెంబరు పిటీషను మీ పరోక్షమందు తీర్మానించడ మగునని మీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
తల్ల సత్యనారాయణ, న్యాయవాది,
సెల్ : 9441341423, ప్లాట్ నెంబర్.105
మామిడి ఎంక్లేవ్, గాంధీనగర్,
యలమంచిలి.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని
ఆటో కార్మికుల భారీ ర్యాలీ

సిఐటియు ఆధ్వర్యాన నినాదాలతో ర్యాలీ చేస్తున్న ఆటో కార్మికులు

ప్రజాశక్తి -తగరపువలస : రాష్ట్రంలో మహిళలకు ఈ నెల 15 నుంచి ఉచిత ఆర్‌టిసి బస్సు ప్రయాణం హామీ అమలు చేస్తున్న నేపథ్యంలో ఆటో కార్మికుల జీవనోపాధి కోసం మాట్లాడాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో కార్మిక సంఘం, సిఐటియు నేతలు డిమాండ్ చేశారు. గురువారం తగరపువలసలో చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్ నుంచి సంతపేట, తాతా థియేటర్ మీదుగా జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి మాట్లాడుతూ, ఆర్‌టిసి తర్వాత గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రయాణసేవలు అందించేది ఆటో కార్మికులన్నారు. మహిళలకు ఉచిత బస్‌ప్రయాణంతో ఆటోల పరిస్థితి అగమ్యగోచరంగా మారనున్న నేపథ్యంలో వీరికి న్యాయం చేయాలని కోరారు.

సంఘం జిల్లా కార్యదర్శి సత్య నారాయణ మాట్లాడుతూ, ఆటో కార్మికులకు వాహన మిత్ర పథకం కింద రూ.15 వేలు చెల్లించాలని, పెట్రోల్, డీజిల్ పై రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫిట్ నెస్ ఛార్జీలు తగ్గించాలని, పోలీసు వేధింపులు ఆపాలని కోరారు కార్యక్రమంలో సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి ఎస్ అప్పలనాయుడు, మండల అధ్యక్షులు నీలాటి రాము, పల్లా పెంటరాజు, శివారెడ్డి, వివిధ ఆటో స్టాండ్ల అధ్యక్షులు పాల్గొన్నారు

ఆహార పదార్థాల నాణ్యత పెంచాలి

తగరపువలస అన్న క్యాంటీన్‌లో భోజనాలు చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -తగరపువలస : అన్నక్యాంటీన్లలో ఆహార పదార్థాల నాణ్యతను మరింతగా పెంచాలని జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి.గంగారావు అన్నారు. గురువారం స్థానిక అన్న క్యాంటీన్‌ను సిపిఎం భీమిలి జోన్ కమిటీ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్ అప్పల నాయుడు, గున్న రాములతో కలిసి పరిశీలించారు. మధ్యాహ్న భోజనం చేశారు. అన్న క్యాంటీన్‌లో ఆహార పదార్థాల నాణ్యత ను మరింతగా పెంచాలని, అన్నం, కూర, సాంబారు, చట్నీ పరిమాణం పెంచాలని, క్లీనింగ్, పరిశుభ్రతను మెరుగు పరచాలని ప్రభుత్వానికి సూచించారు. రద్దీ దష్ట్యా విశాఖ నగరంలో అన్న క్యాంటీన్ల సంఖ్య 25 నుంచి 100కి పెంచాలని కోరారు.అందులో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని కోరారు.

అనాధ బాలికల జీవితాల్లో వెలుగులే లక్ష్యం

ప్రజాశక్తి- సీతమ్మధార : అనాధ బాలికలను సంరక్షించి, వారిని సమాజంలో ఉన్నతులుగా తీర్చిదిద్ది వారి జీవితాల్లో వెలుగులు నింపడమే ఎస్ఎస్ఎస్ వెన్నెల ట్రస్ట్ లక్ష్యమని ట్రస్ట్ చైర్మన్ రవితేజ అన్నారు. గురువారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, ఐదేళ్ల నుంచి 18ఏళ్లలోపు ఆడపిల్లలకు విద్య, వైద్యం, సంరక్షణ అందిస్తూ, వారిని క్రీడలలో అత్యున్నత స్థాయికి చేర్చాలని ఉద్దేశంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు ఈనెల 16న వివిఆర్‌డిఎ చిల్డ్రన్ ఎవినాలో డ్రీమ్ షెల్టర్ సౌజన్యంతో నిర్వహించే ఫౌండేషన్ కార్యక్రమంలో జబర్దస్త్ కళాకారులు, ప్లే బ్యాక్ సింగర్ సమీరా భరద్వాజ్, ఇతర జానపద కళాకారులు, సినీ రంగానికి చెందిన ముఖ్య వ్యక్తులు పాల్గొంటారని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.కార్యక్రమంలో మూన్ పవర్ ఈవెంట్స్ శ్రీనివాస్ సభ్యులు, డ్రీమ్స్ షెల్టర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణ అవసరం

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అంబేద్కర్ : మండల కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు

మండల అధ్యక్ష, కార్యదర్శులుకిరణ్, అవతారం

ప్రజాశక్తి - ఆనందపురం : ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడుకుని, బలోపేతం చేయడంతోపాటు హక్కుల సాధనకు ఉపాధ్యాయులు రాజీలేని పోరాటం కొనసాగించాల్సిన అవసరం ఉందని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్. అంబేద్కర్ అన్నారు. గురువారం మండలంలోని లోడగలవానిపాలెం ప్రాథమిక పాఠశాలలో డిఎన్‌వి. కిరణ్ కుమార్ అధ్యక్షతన యుటిఎఫ్ ఆనందపురం మండల శాఖ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ, బోధనేతర బాధ్యతల నుంచి తప్పించి, ఉపాధ్యాయులను కేవలం బోధనకు పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సిని ఏర్పాటుచేసి, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు.

మండల కమిటీ నూతన కార్యవర్గం

ఈ సందర్భంగా యుటిఎఫ్ ఆనందపురం మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షునిగా బిఎన్‌వి. కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎ్‌హెచ్. అవతారం, గౌరవాధ్యక్షునిగా జి. శ్రీను సహాధ్యక్షులుగా సురేష్ కుమార్, పిన్నింటి శ్రావణి, కోశాధికారిగా గిడుతూరి రాజశేఖర్, కార్యదర్శులు: ఎన్‌వివిఆర్ఎస్.నాయుడు, ఎస్. హరిప్రసాద్, ఎస్.శ్రీను, మాడెం సత్యనారాయణ, జి.రాజు, జి.దాసునాయుడు, ఎస్‌వి. మహేష్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సుందర్ బాబు, ఆడిట్ సభ్యులుగా సత్యానందం, ఎం. రాంజీ, భాను ప్రసాద్, జిల్లా కౌన్సిలర్లుగా వివి. గిరి, వైఆర్‌కె ప్రసాద్, వై. భాస్కర్, ఎంవి. ప్రసాద్, బొడ్డు ఎర్రినాయుడు, వై.ఉమాదేవిలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంతో జిల్లా గౌరవాధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి వై.ఆర్.కే. ప్రసాద్, సీనియర్ నాయకులు వి.వి. గిరి, వై. భాస్కర్, సుందర్‌బాబు పాల్గొన్నారు.

28న 'సెయింట్' ఎఐ ల్యాబ్స్ ప్రారంభం

లోకేష్‌ను ఆహ్వానిస్తున్న రవితేజ

ప్రజాశక్తి -మధురవాడ : విశాఖ జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రముఖ ఐటీ కంపెనీ సెయింట్ సిఎస్ఆర్ నిధులు రూ.8కోట్లతో ఏర్పాటు చేసిన కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ - ఎఐ) ల్యాబ్స్‌ను ఈనెల 29న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభించనున్నారని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు, యువ నేత గంటా రవితేజ తెలిపారు. గురువారం అమరావతిలో మంత్రి లోకేష్‌ను స్వయంగా కలిసి ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. సెయింట్ కంపెనీ విశాఖ జిల్లాలో 50 ప్రభుత్వ పాఠశాలల్లో ఎఐ ల్యాబ్స్ నెలకొల్పడం ద్వారా 7వ తరగతి నుంచి నుంచి 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఐసిటి టూల్స్, ఎల్ఓటి, రోబోటిక్ కిట్స్ ద్వారా నాణ్యమైన డిజిటల్ విద్యాబోధనకు వీలవుతుందన్నారు. వీటిలో ఒక్క భీమిలి నియోజకవర్గంలో 28 పాఠశాలలు ఉన్నాయని, 25 వేల మంది విద్యార్థులు, 200 మంది ఉపాధ్యాయులు లబ్ది పొందుతారన్నారు. సెయింట్ చైర్మన్ బివిఆర్.మోహన్ రెడ్డి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా యువగళం పాదయాత్ర పుస్తకాన్ని రవితేజకు లోకేష్ అందజేశారు.

11 నుంచి ఎపిఇపిడిసిఎల్ క్యాంపు కోర్టులు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని శ్రీకాకుళం, అనకాపల్లి, అంబేద్కర్ కోనసీమ, వెస్ట్ గోదావరి, ఎఎస్ఆర్ పాడేరు సర్కిళ్ల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈనెల 11 నుంచి క్యాంపు కోర్టులు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సిజిఆర్ఎఫ్) ఛైర్‌పర్సన్, విశ్రాంత జడ్జి బి సత్యనారాయణ అన్నారు. ఈ నెల 11న పలాస డివిజన్ కాశీబుగ్గ సెక్షన్, 13న నర్సీపట్నం డివిజన్ కోటవురట్ల సెక్షన్, 21న అమలాపురం డివిజన్ మలికిపురం సెక్షన్, 22న భీమవరం డివిజన్ ఉండి సెక్షన్, 29న రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి సెక్షన్ కార్యాలయాల్లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు క్యాంపు కోర్టులు నిర్వహిస్తారన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, తదితర విద్యుత్ సమస్యలపై వినియోగదారులు తమ ఫిర్యాదులను నేరుగా సిజీఆర్ఎఫ్ కమిటీకి తెలియజేయవచ్చన్నారు. అలాగే విశాఖలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలోని సిజిఆర్ఎఫ్ కార్యాలయానికి నేరుగా గానీ, లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని, వాటిని పరిశీలించి, పరిష్కరిస్తారన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్ 1912 ను సంప్రదించవచ్చన్నారు. సదస్సుల్లో చైర్ పర్సన్ బి సత్యనారాయణతో పాటు కమిటీ సభ్యులు ఎస్ రాజ బాబు, ఎస్ సుబ్బారావు, ఎస్ మురళీకృష్ణ పాల్గొంటారు

ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్ నాశనం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితం నాశనం అవుతుందని భీమిలి నేర విభాగం ఎస్ఐ ఎస్ సూర్యప్రకాశరావు విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ర్యాగింగ్ భూతాన్ని తరిమి కొట్టాలని, ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్‌ను నాశనం చేస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ విష్ణుమూర్తి, ఐక్యూఎసి కోఆర్డినేటర్ బి ప్రసాదరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి -ములగాడ: అనారోగ్యంతో బాధపడుతూ వైద్యసాయం కోసం అర్థించిన పారిశ్రామిక ప్రాంతం 62వ వార్డులో తెలుగుదేశం కాలనీకి చెందిన పొంగా సావిత్రి, పిల్లా శ్రీరాములకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థికసాయం చెక్కులను ప్రభుత్వ విప్, పశ్చిమ శాసనసభ్యులు .పిజివిఆర్. నాయుడు (గణబాబు) లబ్దిదారులకు అందచేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ 62 వార్డు అధ్యక్షులు మజ్జి మలినాయుడు ప్రచార కార్యదర్శి దుర్గారావు, శ్రీధర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

డ్రగ్స్ సామాజిక సంక్షోభం

డివైఎఫ్ఐ జాతీయ కార్యదర్శి హిమాగ్న భట్టాచార్య

మాట్లాడుతున్న హిమాగ్న భట్టాచార్య

ప్రజాశక్తి- సీతమ్మధార : యువత కెరీర్, ఆరోగ్యం, జీవితాన్ని నాశనం చేసి, కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తున్న డ్రగ్స్ నేడు వ్యక్తిగత సమస్యగా కాకుండా సామాజిక సంక్షోభంగా విజృంభిస్తోందని, వీటి నిరోధానికి పటిష్ట చర్యలు అవసరమని డివైఎఫ్ఐ జాతీయ కార్యదర్శి హిమాగ్న భట్టాచార్య అన్నారు.కంచరపాలెం ఊర్వశి జంక్షన్ దరి ఎస్‌టి హాస్టల్‌లో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ, పట్టణాలు, పల్లెలు అని తేడా లేకుండా విద్యార్థులు, యువత నేడు డ్రగ్స్‌కు బానిసలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలియని తనంలో తోటివారి ఒత్తిడితో మొదలైన ఈ వ్యసనం తర్వాత బానిసగా మార్చి ప్రాణాంతకమౌతుందన్నారు. విద్యార్థులు, యువతలో అవగాహన, చైతన్యం ద్వారా ఈ మహమ్మారిని పారదోలవచ్చన్నారు. విశాఖలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వ్యసన పరులను అందుబాటులో ఉండే పునరావాస కేంద్రాల్లో మానసిక ఆరోగ్య సంరక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజు ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ఎస్ఎఫ్ఐ జోన్ నాయకులు ఎర్రిబాబు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

నిరసన తెలుపుతున్న అధ్యాపకులు, సిబ్బంది

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు సాధారణ బదిలీలు చేపట్టాలని, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల సిబ్బందిని వారి మాతృసంస్థలకు తిరిగి పంపించాలని, డిఎ బకాయిలు విడుదల చేయాలని ,ఐ ఆర్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది కళాశాల వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ పి సురేఖకు వినతిపత్రం అందజేశారు. జిసిజిటిఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ విష్ణు మూర్తి, అధ్యాపకులు డాక్టర్ బి సహదేవుడు, బి ప్రసాదరావు, వై వెంకటరావు, డి.మాధురి, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు

ఆరోపణలన్నీ అవాస్తవాలు

ప్రజాశక్తి - ఆరిలోవ :విశాఖ కేంద్రకారాగారంలో అధికారులపై వస్తున్న ఆరోపణలు అవాస్తవమని జైలు పర్యవేక్షణాధికారి ఎం.మహేష్‌బాబు అన్నారు. సెంట్రల్ జైలులో నిబంధనలు మేరకే ఖైదీలను ట్రీట్ చేస్తున్నామన్నారు. తమను వేధిస్తున్నారని, నాణ్యమైన ఆహారం అందించడంలేదని, సెల్ లోపల నుంచి బయటకు వదలడం లేదని, జైలు క్యాంటిన్‌లో అవకతవకలు జరుగుతున్నాయని, తప్పుడు కేసులు బనాయిస్తామని బెదిరిస్తున్నట్లు ఇద్దరు ఖైదీలు విడుదల చేసిన లేఖ నేపథ్యంలో సూపరింటెండెంట్ వివరణ ఇచ్చారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగానే ఖైదీలకు ఆహారం అందిస్తున్నామన్నారు. నెలకు ఒక దఫా డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ కేంద్రకారాగారంలో పర్యవేక్షిస్తుందని, ఎటువంటి లోటుపాట్లు ఉన్నా ఖైదీలు వారికి ఫిర్యాదు చేయవచ్చన్నారు. లోపాలు జరిగితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. ఇద్దరు ఖైదీల సంతకాలతో విడుదలైన లేఖ ఎలా బయటకు వచ్చింది? అది ఎవరు రాసారు? అనే విషయాలపై విచారణ చేయిస్తామన్నారు. ఎవరో ఖైదీలతో ఖాళీ పేపర్‌లో సంతకాలు తీసుకొని లేఖ రాసినట్టు అనుమానిస్తున్నారు.

షేడ్ నెట్స్‌పై రైతులకు అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

షేడ్ నెట్స్‌పై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. ఆసక్తిగల రైతులను మండలానికి 10 మందిని గుర్తించి ఆ వివరాలను ఈ నెల18వ తేదీ లోపు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థకు సమర్పించాలని సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం షేడ్ నెట్స్‌పై ఉద్యానవన, గ్రామీణాభివృద్ధి, కేతి టెక్ కంపెనీతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి, ఉద్యనవన శాఖల అనుసంధానంతో షేడ్ నెట్స్‌ను రైతులకు వేయించడం అనేది ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ షేడ్ నెట్స్ వేసుకుంటే చీడ, పీడ తెగుళ్ల రాకుండా ఉంటాయని చెప్పారు. నీరు తక్కువగా అవసరం పడుతుందని, పంట దిగుబడి అధికముగా ఉంటుందని పేర్కొన్నారు. వివిధ వాతావరణ పరిస్థితులను తట్టుకొని పంటను రక్షించడానికి ఈ షేడ్ నెట్ ఉపయోగపడు తుందన్నారు. సూర్యకిరణాలు నుండి వచ్చిన హానికరమైన కిరణాలునుండి పంటను రక్షిస్తుందని, పంటలు వేడి, చలి, వడగళ్ళు, ఇతర వాతావరణ పరిస్థితులు నుండి రక్షించబడతాయని పేర్కొన్నారు. ఒక్కసారి షేడ్ నెట్ వేసుకుంటే అది 10 సంవత్సరాల వరకు ఉపయోగపడుతుందన్నారు. ఇందులో టమోటాలు, మిరప, క్యాప్సికమ్, పుచ్చకాయలు, కూరగాయలు, పండ్ల తోటలు, పూల తోటలను పెంచవచ్చని చెప్పారు. 13 సెంట్లలో రూ.3,22,800 యూనిట్ కాస్ట్. ఇందులో రైతు రూ.1,61,400 తన వాటాధనంగాను పెట్టుకుంటే హార్టికల్చర్ డిపార్ట్మెంట్ నుండి రూ.1,61,400 సబ్సిడీ రూపంలో వస్తుందని చెప్పారు. మహిళా రైతులకు డిఆర్‌డిఎ నుండి బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి, ఉన్నతి, అంతర్గత అప్పులు ద్వారా రుణం అందిస్తాయని చెప్పారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ కె.శచీదేవి, జిల్లా ఉద్యనవన శాఖ అధికారి ఎంఎ రహీమ్, జిల్లా బిందు సేద్యం పథక సంచాలకులు జివి లక్ష్మి, అన్ని మండలాల ఏపీఎంలు, ఉద్యనవన అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్, పాల్గొన్న అధికారులు

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రామకృష్ణ, సిహెచ్.రామకృష్ణ

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-రాంబిల్లి : రాంబిల్లిలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా 5వ మహాసభలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షులుగా కె.రామకృష్ణ (నర్సీపట్నం), ప్రధాన కార్యదర్శిగా సిహెచ్.రామకృష్ణ (రాంబిల్లి), గౌరవాధ్యక్షులుగా అడిగర్ల రాజు, జిల్లా ఉపాధ్యక్షులుగా పి.చిరంజీవి (పరవాడ), డి.శివ (నర్సీపట్నం), సహాయ కార్యదర్శిగా పి.అప్పలనాయుడు (సబ్బవరం), కోశాధికారిగా జి.అప్పారావు (చంటి), జిల్లా కమిటీ సభ్యులుగా మరో 9 మంది ఎన్నికయ్యారు. నూతన కమిటీ అనకాపల్లి జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పని చేస్తుందని నాయకులు తెలిపారు.

జాతీయ రహదారి సబ్ వేపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

జాతీయ రహదారిని పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఎన్‌హెచ్-16 అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు గురువారం పరిశీలించారు. నేషనల్ హైవే సర్వీసు రోడ్లు, అండర్ పాస్ సబ్ వే నిర్మాణానికి సంబంధించి నేషనల్ హైవే అధికారులతో సమీక్షించారు. పెందుర్తి మండలం రాంపురం జంక్షన్ వద్ద అండర్ పాస్ సబ్ వే నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, వాటి అమలుకు సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఎమ్మెల్యే కోరారు. అనకాపల్లి హైవే నుండి ఆనందపురం వెళ్లే మార్గంలో పెందుర్తి వచ్చేటప్పుడు రోడ్డు సదుపాయం లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని సర్వీస్ రోడ్ సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నేషనల్ హైవే-16 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి, ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభాత్ రంజన్, సైట్ ఇంజనీర్లు పవన్ కుమార్, రిచ్చర్డ్, తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, సీనియర్ నాయకులు జామి గంగు నాయుడు, ఇందల వెంకటరమణ, సాలాపు వెంకటేశ్వరరావు, బలిరెడ్డి అప్పారావు, గండి భూషణ్‌రావు, రాంపురం ఎంపీటీసీ గండి హిమబిందు, హర గోపాల్ పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ శివారు గరుగుబిల్లి గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణలో భాగంగా భారీ ట్యాంక్ నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు అభ్యర్థన మేరకు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి నిధులు మంజూరు చేశారు. జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటి కుళాయిలతో పాటు 40,000 లీటర్ల కెపాసిటీతో వాటర్ ట్యాంక్ నిర్మిచనున్నారు. కూటమి నాయకులు కుంచ అంజిబాబు, మల్లు గోవింద, రాజ నారాయణమూర్తి, మద్దాల నాగరాజు, పాత్రపల్లి మాలిబాబు, ధనిమిశెట్టి పైడిబాబు, గాడి అంజి పాల్గొన్నారు.

గ్రామాల్లో ధర్మశ్రీ పర్యటన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : వైసిపి ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ గురువారం మండలంలోని హరిపాలెం, ఎం.జగన్నాధపురం, నరేంద్రపురం, మల్లవరం గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. కూటమి పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పిన్నమ్మరాజు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మేయర్ పీలాను కలిసిన సురేంద్ర

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావును ఏపి రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా వచ్చిన పీలా శ్రీనివాసరావును అభినందించి సత్కరించారు. జీవీఎంసీ అనకాపల్లి పరిధిలో ఉన్న కొన్ని ప్రధాన సమస్యలను మేయర్‌కు తెలియజేశారు.

జన సురక్ష పథకాలను వినియోగించుకోండి

మాట్లాడుతున్న జోనల్ హెడ్ శాలినీ మీనన్

ప్రజాశక్తి-అనకాపల్లి : జన సురక్ష పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని విశాఖపట్నం జోనల్ హెడ్ శాలినీ మీనన్ అన్నారు. లీడ్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయనగరం రీజియన్ ఆధ్వర్యంలో జన సురక్ష క్యాంప్ గురువారం అనకాపల్లి గుండా జంక్షన్ శంకరన్ మీటింగ్ హాల్‌లో నిర్వహించారు. పీఎంజెజెబివై, పీఎం ఎస్బివై, ఏపీవై, రైతు కార్డుల రీకేవైసీ లాంటి పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ద్వారా బ్యాంకు ఖాతాదారులకు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాల నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా శాలినీ మీనన్ మాట్లాడుతూ పిఎంఎస్‌బివై ద్వారా కేవలం రూ.20 వార్షిక ప్రీమియంతో రూ.2 లక్షల ప్రమాద బీమా కవరేజ్ లభిస్తుందని, పిఎంజెజెబివై ద్వారా రూ.436 ప్రీమియుతో 18 నుండి 55 సంవత్సరాల వయసున్నవారికి సహజ మరణం లేదా ప్రమాద మరణానికి రూ.2 లక్షల బీమా లభిస్తుందని చెప్పారు. ఇంత తక్కువ ప్రీమియోతో జీవిత భద్రతను పొందే అవకాశం ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం రీజనల్ హెడ్ జితేంద్ర శర్మ, డిఆర్డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ శచీదేవి, ఎల్డిఎం సత్యనారాయణ, యూబీఐ ట్రైనింగ్ హెడ్ పిఎస్.రాజా, బ్యాంకు మేనేజర్లు, అధికారులు, బిజినెస్ కరస్పాండెంట్లు, సిఎఫ్ఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులు ప్రజాస్వామ్య విరుద్ధం

ప్రజాశక్తి-అనకాపల్లి : పాఠశాలల్లో విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని, తక్షణమే ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఏఐఎస్ఎఫ్ హెచ్చరించింది. ఈ మేరకు గురువారం అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి బి బాబ్జి, జీ ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల హక్కులను హరించేలా పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, ఇతర రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా నిషేధిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు దివ్య, సంధ్య, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి నేతలపై టిడిపి దాడి హేయం

ప్రజాశక్తి-అనకాపల్లి : పులివెందులలో వైసిపి రాష్ట్ర బీసీ విభాగం అధ్యక్షులు ఎమ్మెల్సీ రాచగొల్ల రమేష్ యాదవ్, వైసిపి నాయకులపై టిడిపి గుండాల దాడి హేయమైన చర్యని అనకాపల్లి జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు ఉద్దండం త్రినాధరావు పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కడప జిల్లా పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల నేపథ్యంలో వైసీపీ నాయకులపై టీడీపీ కిరాయి గూండాలు ఎన్నికల నిబంధనలను అతిక్రమించి అధికార బలంతో బరి తెగించి, రెచ్చి పోయి కర్రలు కత్తులతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పుల్లేటి వెంకటేష్, లోచలపు సుజాత, జాజుల రమేష్, జడ్పీటీసీ సేనాపతి సంధ్యా రామ్, గైపూరి రాజు, బొడ్డేడ చెల్లయ్య నాయుడు, కెఎం నాయుడు, బొడ్డేడ శివ, త్రినాథ్ పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్‌తో ప్రజల జీవితాలకు ముప్పు

పాయకరావుపేట : నక్కపల్లి మండలంలో ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పార్కుతో ప్రజల జీవితాలను ముప్పు తప్పదని, ప్రభుత్వం వెంటనే ఈ ప్రాజెక్టు నిర్మాణ ప్రయత్నాలను విరమించుకోవాలని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది వడ్డమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ కాంట్రాక్టర్లతో కుమ్మక్కైన స్థానిక ఎమ్మెల్యే, హోం మంత్రి వంగలపూడి అనిత ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని, ఈ ప్రాంత ప్రజలకు ద్రోహం తలపెడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో బి రమేష్ , శామ్యూల్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ సమస్యలపై రెవెన్యూ ఆఫీసులో కలవాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : అన్నదాత సుఖీభవ పథకం రెవెన్యూ సమస్యల వల్ల నిలిచిపోయిన రైతులు తహశీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని బుచ్చయ్యపేట తహశీల్దార్ ఎం.లక్ష్మీ తెలిపారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని రైతులు అన్నదాత సుఖీభవ పథకాన్ని పొందడానికి ఆధార్ సీడింగ్లో లోపాలు, పేర్లలో తప్పులు ఉన్నవారు ఈ నెలాఖరులోగా సరి చేయించుకోవచ్చని తెలిపారు. అర్హత కలిగిన సొంత ఇంటి స్థలాలు కలిగిన వారు ఎల్పీసీలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ హెచ్ఈసీ, సిఈసి గ్రూపులలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కళాశాల సివిక్స్ లెక్చరర్ డాక్టర్ ఎస్వీఎల్ఎన్ ఉదయకుమార్ తన తండ్రి సనపల నర్సింగరావు జ్ఞాపకార్థం బహుమతులను ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ పి. శిరీషా, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి స్వప్న

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-కశింకోట : ప్రకృతి వ్యవసాయం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి స్వప్న అన్నారు. మండలంలోని సుందరయ్యపేట గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) సౌజన్యంతో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల భూమి సారం పెరుగుతుందన్నారు. కన్నురుపాలెం పశు వైద్యాధికారి దయానా మాట్లాడుతూ పశువులకు వచ్చే వ్యాధులు, టీకాలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ, రంజిత్, గ్రామ ఉద్యాన అధికారి శ్రీనివాసరావు, కూండ్రపు అరుణ, వెంకట, డి.రమణ, జి.వెంకట అప్పారావు, వెంకటలక్ష్మి, బి.వరలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళా సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

హజ్ యాత్రకు ఆర్థిక సాయంపై హర్షం

ప్రజాశక్తి-కశింకోట : హజ్ యాత్రికులకు లక్ష రూపాయలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడంపై టిడిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ బాబర్ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రానికి ఎన్నుకున్న 72 మంది యాత్రికులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున రూ.72 లక్షలు రూపాయలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను గురువారం పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం ఎస్వి.పద్మావతి, ట్రస్ట్ సభ్యులు మీసాల కొండబాబు (కన్నా), బొబ్బిలి సన్యాసినాయుడు, తెలుగు ఉపాధ్యాయులు మండల మురళి, సంఘమిత్ర కార్యదర్శి బొంతు మంగపతి చేతుల మీదుగా ఈ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు కొరతం ఈశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

ప్రజాశక్తి-కోటవురట్ల : విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు కృషి చేయాలని పవన్ విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. అవంతి ఇంజనీరింగ్ కళాశాల వద్ద గురువారం మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్య అతిథులుగా హాజరైన ప్రొఫెసర్ పల్లంశెట్టి డిజి ఫక్, పి.అమల రాజ్, బ్రహ్మకుమారీస్ సోదరి శృతి విద్యార్థులకు మార్గ నిర్దేశం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు మాట్లాడుతూ సమాజంలో నూతన విషయాలు నిరంతరం తెలుసుకున్నప్పుడే అనుకున్న విభాగాలలో విజయం సాధించగలుగుతారని చెప్పారు. కార్యక్రమంలో డానియల్ రాజు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కాలువ అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కెెం.పాలెం రెవెన్యూ పరిధిలో వెంకయ్య చెరువు పైకాలువ అభివృద్ధి పనులను గురువారం రైవాడ ప్రాజెక్ట్ చైర్మన్ పోతల పాత్రుడునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకయ్య చెరువు నుండి వచ్చే ప్రధాన కాలువకు బటా మార్గంతో పాటు, కాంక్రీట్ మెత్తులు ఏర్పాటు చేయనున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, మాజీ సర్పంచ్ గంధం జగ్గారావు, కోమార బాబురావు, నీటి సంఘం అధ్యక్షుడు గండిపడాల గోవింద, డైరెక్టర్ పెద్దాడ నర్సిబాబు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్‌లో తాజా సాంకేతికతలపై సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం "సాఫ్ట్వేర్‌లో తాజా సాంకేతికతలు" అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డిపి) నిర్వహించారు. ఈ సదస్సులో రిసోర్స్ పర్సన్ యూఎస్ఏ టెన్నకో ఐటి ఎంటర్ప్రైజ్ అప్లికేషన్స్ గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్ శ్రీరామ్ పెంటకోట ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో అభివృద్ధి చెందుతున్న సాధనాలు, అనువర్తనాలు, నేటి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) పరిశ్రమపై వాటిపై పెరుగుతున్న ప్రభావంపై తెలియజేశారు. అత్యాధునిక ఏఐ సాధనాలు, రియల్-టైమ్ కేస్ స్టడీస్, డేటా వేర్‌హౌస్ నిర్వహణ, డేటాబేస్ భద్రతపై వివరించారు. కార్యక్రమంలో డైట్ చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ వైకుంఠరావు, ఆర్ అండ్ డి కన్వీనర్ డాక్టర్ కె.సుజాత తదితరులు పాల్గొన్నారు.

వినాయక నవరాత్రి రాట మహోత్సవం

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక స్వయంభూ శ్రీవిఘ్నేశ్వర స్వామి ఆలయంలో స్థానిక శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్.రాజు చేతులు మీదుగా వినాయక నవరాత్రి ఉత్సవాల రాటను గురువారం వేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పసుమర్తి సాంబశివరావు కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ మూర్తి, జి మల్లనాయుడు, ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతి, చేకూరి రాజు, దేవరపల్లి వెంకట అప్పారావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగగంగాధర్, పాల్గొన్నారు.

దిబ్బిడిలో సమిధ గ్రామసభ

ప్రజాశక్తి-బుచ్చెయ్యపేట : మండలంలోని దిబ్బిడి పంచాయతీ కార్యాలయం వద్ద సమిధ గ్రామసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామంలోని ఖాళీ స్థలాల వివరాలు పంచాయతీ సిబ్బంది సేకరిస్తారని తెలిపారు. ఇంటి యజమానులు సర్వే సిబ్బందికి వివరాలను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెదరెడ్ల మాణిక్యం, మాజీ ఎంపీటీసీ గొన్నాబత్తుల శ్రీనివాసరావు, సేనాపతి మణికంఠ, పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి, నాగమయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గ్రామ చిత్ర పటాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

గోవాడ సుగర్ ఫ్యాక్టరీపై హామీని నిలబెట్టుకోవాలి

సిపిఎం జిల్లా నాయకులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

గోవాడ సుగర్ ఫ్యాక్టరీపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సహకార రంగానికి రాష్ట్రంలోనే మోడల్‌గా నిలిచిన గోవాడ(చోడవరం) చక్కెర కర్మాగారం నేడు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని పేర్కొన్నారు. చోడవరం, మాడుగుల నర్సీపట్నం నియోజకవర్గాల ప్రజలకు ప్రధాన జీవనాధారమైన గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆదుకుంటామని ఎన్నికల ముందు కె.కోటపాడు మండలం గొందుపాలెంలో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు, బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నాడు అనకాపల్లి ఎంపీగా, ఈ ప్రాంత ఎమ్మెల్యేలుగా పోటీ చేసి వారు సైతం ఫ్యాక్టరీని నిలబెడతామని చెప్పారని, కాని గెలిచి అధికారంలోకి వచ్చాక ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. పైగా ఈ ఫ్యాక్టరీని మూత వేయాలని చూస్తున్నారని, అదే జరిగితే ఈ ప్రాంత రైతులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. గత సీజన్‌లో చెరుకు సరఫరా చేసిన రైతులకు, కార్మికులకు సుమారు రూ.30 కోట్లు వరకు బకాయిలు చెల్లించవలసి ఉందని పేర్కొన్నారు. వచ్చే సీజన్‌లో ఫ్యాక్టరీ క్రషింగ్‌కు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-సబ్బవరం

తల్లిపాలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ వి.లలితకుమారి, ఈఓపిఆర్‌డి బి.చైతన్య, జనసేన నేతలు సాలాపు వెంకటేశ్వరరావు, ఇందల వెంకటరమణ, వైస్ ఎంపీపీ శరగడం రూన్నీ లక్ష్మీ రాణి రాము, ఎంపిటిసీలు సింగంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : నవజాత శిశువులకు ఆరు నెలల పాటు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలన్న విషయాన్ని గర్భిణులు అవగాహన కల్పించాలని చౌడువాడ పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ చైతన్య అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో దేవరాపల్లి కె కోటపాడు మండలాల అంగన్వాడి కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. తల్లిపాలు బిడ్డలకు అమృతంతో సమానమని చెప్పారు. అనంతరం పలువురు గర్భిణీ స్త్రీలకు సీమంతం నిర్వహించారు. ఎంపిటిసీ బంగారు లక్ష్మి, సూపర్వైజర్ కిల్లో సుశీల, రాములమ్మ, లక్ష్మి మాట్లాడారు.

నక్కపల్లి: తల్లిపాలతో బిడ్డకు శ్రేష్ఠమని ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అన్నారు. నక్కపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద గురువారం తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఐసిడిఎస్ పిఒ శ్రీవిద్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, టిడిపి నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, గింజాల లక్ష్మణరావు, న్యాయంపూడి సర్పంచ్ రెడ్డి వరహాలు బాబు, గొడిచర్ల పిఎసిఎస్ చైర్మన్ దార్ల కప్ప, మాజీ వైస్ ఎంపిపీ వైబోయిన రమణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: సమత కళాశాలలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లి పాలు విశిష్టత, గర్భాశయ కేన్సర్ గురించి ముఖ్య అతిథి, రెయిన్‌బో హాస్పిటల్ డాక్టర్ ఎం.వి.ఆర్.శైలజ అవగాహన కల్పించారు. కళాశాల డీన్ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.విజయరవీంద్ర పాల్గొన్నారు.

మెడికవర్ హస్పిటల్స్‌లో తల్లిపాలలోని పోషక విలువలు, శిశువు ఆరోగ్య అభివృద్ధిపై దాని ప్రభావం గురించి అవగాహన కల్పించారు. నర్సులు, రెసిడెంట్ డాక్టర్లకు క్విజ్ పోటీలు, పోస్టర్ ప్రదర్శనలు, విద్యా కార్యక్రమాలు, బ్రెస్ట్‌ఫీడింగ్ సమస్యలపై మినీవర్క్‌షాపులు నిర్వహించారు. డాక్టర్లు సాయిసునీల్‌కిషోర్, విజయ్, మౌనిక, ప్రియాంక, సెంటర్ హెడ్ శ్రీకాంత్ తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు.

మధురవాడ: ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తల్లి పాలు ఉపయోగకరంగా నిలుస్తాయని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి అన్నారు. గురువారం తల్లి పాల వారోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన అవగాహన ర్యాలీని ప్రారంభించారు. తల్లి పాలతో బిడ్డ రోగ నిరోధక శక్తి పెరగటంతో పాటు జీర్ణాశయ సంబంధ సమస్యలకు చెక్ పెడతాయన్నారు. కార్యక్రమంలో గీతం లైఫ్ సైన్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్, పాల్గొన్నారు.

బాబు షూరిటీ - మోసం గ్యారెంటీ ప్రచారం

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కంబాల జోగులు తదితరులు

ప్రజాశక్తి-పాయకరావుపేట : మండలంలోని మాసాహెబుపేటలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు ఆధ్వర్యంలో బాబు షూరిటీ - మోసం గ్యారెంటీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వైసిపి పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి లంక సూర్యనారాయణ, ఎంపిపి ఇనరవు తాతారావు, వైసిపి మండల అధ్యక్షులు గెద్దమూరి శ్రీనివాసరావు, నాయకులు ధనిశెట్టి బాబూరావు, దగ్గుపల్లి సాయిబాబా, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి : జీవీఎంసీ 81వ వార్డులో రాష్ట్ర గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, పార్టీ ప్రధాన కార్యదర్శి దాడి నారాయణరావు ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అనకాపల్లి వైసిపి సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అగ్నిమిత్రి చెట్టు ప్రాంతంలో ఇంటింటికి వెళ్ళి ముఖ్య మంత్రి చంద్రబాబు తప్పుడు హామీలు ఇచ్చి ప్రజలకు చేసిన మోసం గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొడ్డేడ దుర్గలక్ష్మి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్, నాయకులు కెయం నాయుడు, జాజుల రమేష్, కోరుకొండ రాఘవ తదితరులు పాల్గొన్నారు.

9 నుండి శ్రీప్రకాష్‌లో ఖోఖో పోటీలు

ప్రజాశక్తి-పాయకరావుపేట : శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో క్లస్టర్ -7 (ఆంధ్రా, తెలంగాణా) సిబిఎస్ఇ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 9 నుండి 11 వరకూ అండర్ -14, అండర్ -17, అండర్ -19 బాలుర, బాలికల విభాగంలో ఖోఖో పోటీలు జరుగుతాయని ఆ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల నుండి సుమారు 1800 విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొంటున్నారని, ఇందుకు సంబంధించి ఖోఖో కోర్టులు, వసతి, భోజన ఏర్పాట్లు చేస్తున్నామని విజయప్రకాష్ పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు చేనేత రాట్నం నమూనాను అందిస్తున్న రాజారావు

చేనేతకు తగ్గని ఆదరణ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అనేక రకాల వస్త్ర పరిశ్రమలు వస్తున్నప్పటికీ చేనేత రంగానికి ఆదరణ తగ్గలేదని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. అచ్యుతాపురంలో గురువారం ఏర్పాటు చేసిన జాతీయ చేనేత దినోత్సవంలో ఎమ్మెల్యేతో పాటు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ చేనేతతో తయారుచేసిన వస్త్రాలనే అనేకమంది ధరించటానికి మక్కువ చూపిస్తున్నారని చెప్పారు. అనంతరం చేనేత కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు పప్పు రాజారావు, కూటమి నాయకులు రాజాన సన్యాసినాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని నాయుడుపాలెంకు చెందిన కూండ్రపు అప్పలనాయుడు మాస్టారు జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు కూండ్రపు నరసింహామూర్తి ఆర్థిక సహాయంతో బీసీ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు110 మందికి నోట్ పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు, పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్కా రామునాయుడు, ఎంఇఒలు దివాకర్, సాయి శైలజలు విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైల టీవీ అప్పారావు, బొద్దపు చిన్నారావు, పైల రాధాకృష్ణ వర్రి హరి పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్ర లేఖనం, క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-కోటవురట్ల : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఆగస్టు 15న బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసిపి నుండి జనసేనలో చేరిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని కొండకర్ల గ్రామానికి చెందిన వైసిపి నాయకులు కోట్ని శివ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు గురువారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చేతుల మీదుగా జనసేన పార్టీలో చేరారు. అచ్యుతాపురంలోని తన స్వగృహంలో ఎమ్మెల్యే వారికి జనసేన కండువాలు వేసి పార్టీకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు బి.రామదాసు, నాయకుడు ద్వారపురెడ్డి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. సమాచార హక్కు చట్టం 20 వసంతాల వేడుక సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. జోనల్ స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వం, డిబేట్, క్విజ్ పోటీలు జరిగాయని, అంతర్ కళాశాల స్థాయిలో జరిగిన పోటీలలో వై.ధనలక్ష్మి వ్యాసరచన మొదటి స్థానం, ఎస్.గాయత్రి రెండవ స్థానం, క్విజ్ పోటీలలో వై ధనలక్ష్మి, ఎస్ గాయత్రి, బి.కృపాచందు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపల్ అభినందించి, పుస్తకాలు, సర్టిఫికెట్స్‌ను అందించారు. కార్యక్రమంలో కాలేజీ సిబ్బంది, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

16వ రోజుకు దళిత రైతుల నిరసన దీక్ష

నినాదాలు చేస్తున్న దళిత రైతులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మాకవరపాలెం మండలం జి.కోడూరులో క్వారీ కార్యకలాపాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ దళిత రైతులు చేపట్టిన నిరసన దీక్ష 16వ రోజుకు చేరుకుంది. నర్సీపట్నంలోని రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డిఓ) కార్యాలయం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో, వివిధ రాజకీయ పార్టీల మద్దతుతో ఈ ఆందోళన కొనసాగుతోంది. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, గత రాత్రి తమను అక్రమంగా పోలీసుస్టేషన్ లో 20 గంటల పాటు నిర్భందించారన్నారు. తమ భూములను నాశనం చేస్తున్న వారిని అడ్డుకొంటే పోలీసులతో మమ్మల్ని నిర్భందించడం అన్యాయమని, తమకు న్యాయం చెయ్యాలన్నారు. ఈ సందర్భంగా ఏఐబీఎస్‌పీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొట్టా నాగరాజు మాట్లాడుతూ, 16 రోజులుగా రైతులు తమ ఇళ్లను, కుటుంబాలను విడిచి, తమ భూములను కాపాడుకోవడానికి నిరాహార దీక్ష చేస్తున్నారన్నారు. అయినప్పటికీ, ప్రభుత్వ అధికారులు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ సమస్యను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తమ భూములను క్వారీ కార్యకలాపాల నుండి రక్షించుకోవడానికి పోరాడుతున్నారని, ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమని తెలిపారు. క్వారీని తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ ఆందోళనకు పలు ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయి.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

12న నులిపురుగుల మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి: ఈనెల 12న నులి పురుగుల దినోత్సవం పురస్కరించుకొని అన్ని ప్రభుత్వ ,ప్రైవేటు స్కూల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల్ని పంపిణీ చేయాలని మండల ప్రత్యేక అధికారి విజయ, ఎంపీడీవో డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గొడిచెర్ల పిహెచ్‌సి వైద్య సిబ్బందితో కలిసి కరపత్రాలు, గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

మాట్లాడుతున్న అధికారులు

పి 4 పై సమీక్ష

ప్రజాశక్తి- నక్కపల్లి: పి 4 కార్యక్రమం పక్కాగా అమలు చేయాలని మండల ప్రత్యేక అధికారి విజయ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డి సీతారామరాజుతో కలిసి గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పి 4 కార్యక్రమానికి సంబంధించి గ్రామాల్లో చేపట్టిన సర్వే, మార్గదర్శులు ఎంపిక వంటి అంశాలపై చర్చించారు. ప్రభుత్వం ఈనెల 19వ తేదీ నుండి పి 4 కార్యక్రమాన్ని ప్రారంభిస్తుందన్నారు. మార్గదర్శులు ఇచ్చే చిన్న ఆసరా బంగారు కుటుంబాలకు కొండంత అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పథకాలపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి -అనంతగిరి: చిలకలగెడ్డ రైతు సేవ కేంద్రంలో పంచాయతీ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాల పై కాశిపట్నం పశువైద్యాదికారి ..ఎస్ గణేశ్వరరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యంగా పశు సంపదను ఆర్థిక వనరుగా చేసుకొని మేలు రకం పాడి పశువుల ద్వారా పాల ఉత్పత్తిని, గొర్రెలు మేకల ద్వారా మాంస ఉత్పత్తిని పెంపోదించుకోవాలన్నారు.

మహిళా డెయిరీ సంఘాలతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - చీడికాడ: రైతు సేవ కేంద్రం పరిధిలో మహిళలు మహిళా డెయిరీ సహకార సంఘాలు ఏర్పాటు చేసుంటే ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చునని పలువురు వక్తలు తెలిపారు. అర్జునగిరి గ్రామంలో మహిళా డెయిరీ సహకార సంఘాల నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ చోడవరం డాక్టర్ వి చిట్టి నాయుడు, అసిస్టెంట్ డైరెక్టర్ వి.మాడుగుల ప్రశాంత్, డాక్టర్ మణి లక్ష్మణ్ రాజేష్, ఏపీ డి డి సి ఎఫ్ మేనేజర్ ఆధ్వర్యంలో రైతు సేవ కేంద్రంలో మహిళా డెయిరీ సహకార సంఘాల ఏర్పాటుపై గురువారం అవగాహన కల్పించారు.కనీసం 11 మంది మహిళా పాడి రైతులు మొదలుకొని ఎంత మందైనా మహిళలు గ్రూపుగా ఏర్పడవచ్చునన్నారు. దీని కోసం ప్రభుత్వం పాలు కొలత చేయుటకు 2 లక్షలు విలువైన పరికరాలు సరఫరా చేస్తుందన్నారు. ఆసక్తి మహిళా పాడి రైతులు దగ్గరలోని పశు వైద్యశాల, రైతు సేవాకేంద్రంలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నార. ఈ కార్యక్రమం సర్పంచ్ బోడాల రమాదేవి, ఎంపీటీసీ అమ్మతల్లినాయుడు, మాజీ వైస్ ఎంపీపీ గణపతి, కూటమి నాయకులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న నోడల్ అధికారి

పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం గురువారం నర్సీపట్నం ఎన్జీవో హెూం సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మధ్యంతర భృతి (ఐ.ఆర్), ఐఆర్‌లు,డి.ఆర్ లు. వెంటనే చెల్లించాలని, ప్రతి ఆసుపత్రిలో హెల్త్ కార్డు చూపించిన వెంటనే నగదు రహిత వైద్యం అందించాలని. తీర్మానించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. సంఘ అధ్యక్షులుగా వర్రె గజ్జలమ్మ, సహాయ అధ్యక్షులుగా కె. అప్పలనాయుడు, డి తిరుపతిరావు, కార్యదర్శిగా బి.వి.యస్.ఎన్. రాజు, సహాయ కార్యదర్శులుగా అప్పలనాయుడు, గౌరి నాయుడు, సూర్యనారా యణ, గౌరవ అధ్యక్షులుగా రామస్వామి. అసోసియేట్ అధ్యక్షులుగా రామచంద్ర రాజును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

సన్మానిస్తున్న పెన్షనర్లు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

మట్టవానిపాలెంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి -రావికమతం: మండలంలోని గుడివాడ పంచాయతీ మట్టవానిపాలెం గ్రామంలో విఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సత్యారావు ఆధ్వర్యాన సర్పంచ్ గుమ్మాల శంకర్రావు సహకారంతో గురువారం ఉచిత గుండె, కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి విశాఖ ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రి ప్రముఖ గుండె, కంటి వైద్య నిపుణులు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ టంకర్రావు మాట్లాడుతూ,వి ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సత్యా రావు స్వచ్ఛందంగా ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ వైద్య శిబిరంలో 10 మందికి కంటి, 12 మందికి గుండె ఆపరేషన్లు అవసరమని గుర్తించడం జరిగిందన్నారు. వీరిని ఎన్నారై ఆస్ప్రత్రికి తరలించి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మరమ్మతు చేపడుతున్న సిబ్బంది

తాగునీటి బోరు మరమ్మతు పనులు

ప్రజాశక్తి: రావికమతం: మండలంలో కవగుంట గ్రామంలో మరమ్మత్తులకు గురైన మంచినీటి బోరును గురువారం కవగుంట సర్పంచ్ దాసరి సూర్య కుమారి ఆధ్వర్యంలో గురువారం మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో సాసుబిల్లి ఇళ్ల సమీపంలో ఉన్న మంచినీటి బోరు మరమ్మతులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో ఈ బోరుపై సుమారు 50 కుటుంబాలు ఆధారం పడుతునానా్నయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజబాబు, వార్డు మెంబర్లు చంద్రాన రామనాయుడు, బర్నికాన మహా లక్ష్మమ్మ పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఘన నివాళి

నక్కపల్లిలో అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలో చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ అధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో నోబుల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ క్లబ్ వ్యవస్థాపకులు, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు వై వెంకటరమణ ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. విద్యార్థులకు ఠాగూర్ జీవిత చరిత్రను వివరించారు. తాను 2017 సంవత్సరంలో రవీంద్రనాథ్ ఠాగూర్ పేరిట నిరుద్యోగులతో కలిసి క్లబ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని ద్వారా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, ఠాగూర్ జీవిత చరిత్ర పుస్తకాలను విద్యార్థులకు అందిస్తుంటామన్నారు.

నర్సీపట్నం టౌన్: స్థానిక శాఖా గ్రంథాలయంలో రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని పురస్కరించుకుని గ్రంథాలయధికారిణి దమయంతి ఆధ్వర్యంలో ఠాగూర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాఠకులు రామచంద్రరావు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు, పి ప్రభాకర్‌లు పాల్గొని రవీంద్రనాథ్ ఠాగూర్ జీవిత చరిత్రను వివరించారు.

నర్సీపట్నంలో నివాళులర్పిస్తున్న పాఠకులు

ములగాడ : విశ్వకవి రవీంధ్రనాథ్ ఠాగూర్ రచనలు మానవత్వానికి, ప్రకృతి రమణీయతకు ప్రసిద్ధి చెందినవని మల్కాపురం శాఖ గ్రంథాలయాధికారి వి. అజయ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని పురస్కరించుకుని ఘనంగా నివాళులర్పించారు. రవీంధ్రనాథ్ ఠాగూర్ రచించిన గీతాంజలి నోబెల్ సాహిత్య పురస్కారాన్ని అందుకుందున్నారు. కార్యక్రమంలో మల్కాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్యామలరావు, అధ్యాపకులు ప్రసాద్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఎంపీడీవో

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో సిహెచ్ లక్ష్మీపురంలో చేపట్టిన పారిశుధ్య పనులను గురువారం ఎంపీడీవో డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శి కి సూచించారు. ప్రతి ఇంట తడి పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని గ్రీన్ అంబాసిడర్లకు తెలియజేశారు. వాటర్ ట్యాంక్ లో క్లోరోనేషన్ చేయించారు.

బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తెలుగు సినీనటుడు విజయ్ దేవరకొండ బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్‌కు దూరంగా ఉండాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా అద్యక్షులు యుఎస్ఎన్.రాజు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. బెట్టింగ్ యాప్‌ల వల్ల యువతకు నష్టం జరుగుతుందని, డబ్బులు పోగొట్టుకొని రోడ్డున పడుతున్నారని తెలిపారు. డబ్బుల కోసం కక్కుర్తి పడి బెట్టింగ్ యాప్‌లను ప్రమోషన్ చేయడం తగదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ బెట్టింగ్ యాప్‌లను నిషేదించాలని డిమాండ్ చేశారు.

మూడో విడత ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా అర్హులైన పేద కుటుంబాలకు ఉచిత గ్యాస్ మూడో విడత కార్యక్రమం ప్రారంభమైందని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కెజిహెచ్‌లో వంశీకృష్ణ పర్యటన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ కార్డియాలజీ విభాగంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కెజిహెచ్‌లో గుండె ఆపరేషన్లు ఆపలేదు, విభాగాన్ని మూయలేదని తెలిపారు. గుండె శస్త్ర చికిత్సకు ఉపయోగించే మిషన్‌లో సాంకేతిక సమస్య వల్ల అది పనిచేయడం లేదన్నారు. శనివారం కొత్త మిషన్ అందుబాటులోకి రానుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కెజిహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సోదరభావానికి స్ఫూర్తిదాయకం రక్షాబంధన్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సోదర భావాన్ని పెంపొందించడంతోపాటు, ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రతబాగ్చి పిలుపునిచ్చారు. గురువారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధులు ఏర్పాటుచేసిన రక్షా బంధన్ వేడుకల్లో పోలీస్ కమిషనర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రక్షాబంధన్ అత్యంత ముఖ్యమైన పర్వదినమని, ప్రతి ఇంట శుభం జరిగేందుకు ఎక్కువ మంది ఈ వేడుకలను నిర్వహించుకుంటారని తెలిపారు. సోదర భావానికి రక్షా బంధన్ ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు కమల్ బెయిడ్, బ్రహ్మకుమారీల ప్రతినిధులు బికె రామేశ్వరి, శివలీల, ఏజ్ కేర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఎన్ఎస్.రాజు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, పాత్రికేయులు ఆర్.నాగరాజు పట్నాయక్ పాల్గొన్నారు.

సరిహద్దు సమస్యలను పరిష్కరించు కోవాలి

ప్రజాశక్తి నర్సీపట్నం

గ్రామీణ ప్రాంతాలలో తలెత్తే సరిహద్దు సమస్యలను గ్రామాలలో గ్రామ పెద్దలలో ప్రజలలో పరిష్కరించుకోవాలని తహసిల్దార్ రామారావు అన్నారు, పెద బొడ్డేపల్లి గ్రామంలో సర్వే నంబర్ 137/2 తలెత్తిన సమస్యపై మంచాల రాంతల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరు వర్గాలతో సమస్య పరిష్కారానికి సమావేశం ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యను వివాదంగా చేసుకుని కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరిగే కంటే సమస్యను గ్రామాలలో గ్రామ ప్రజలలో పరిష్కరించుకునేందుకే ప్రయత్నించాలన్నారు. విలువైన కాలాన్ని వృధా చేసుకోవడం తగదని ఇరువర్గాలకు సర్ది చెప్పారు, అధికారుల చుట్టూ కోర్టుల చుట్టూ తిరిగితే సమస్య జటిలమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నారాయణరావు ఉన్నారు.

మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధి వేగవంతం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరంలో చేపట్టాల్సిన మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధి ప్రక్రియను వేగవంతం చేయాలని, వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. అన్ని రకాల సాంకేతిక అంశాలను, టెండర్ల ప్రక్రియలను త్వరితగిన పూర్తి చేయాలని చెప్పారు. విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర అధికారులతో గురువారం తన ఛాంబర్లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విశాఖపట్టణం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల వరకు విస్తరించిన విఎంఆర్‌డిఎ పరిధిలో చేపట్టాల్సిన 25 మాస్టర్ ప్లాన్ రోడ్లపై సమీక్షించారు. ఏయే చోట్ల ఎంత భూమి అవసరం, స్థానిక సమస్యలు, ప్రణాళికలు తదితర అంశాలపై చర్చించారు. భూసేకరణ, టెండర్లు, టిడిఆర్‌ల జారీ ప్రక్రియలను నిబంధనలకు లోబడి పారదర్శకంగా నిర్వహించాలన్నారు. టెండర్ల ప్రక్రియలకు సంబంధించిన చర్యలు తీసుకోవాలని, సెప్టెంబర్ రెండో వారం నుంచి పనులు మొదలు పెట్టాలని నిర్దేశించారు. 2026 జూన్ లేదా జూలై నాటికి రోడ్లు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

నిర్బంధం ప్రయోగించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలి

- ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా బల్క్ డ్రగ్ పార్కు నిర్మాణ యోచన విరమించుకోవాలి

- కలెక్టర్‌కు సిపిఎం లేఖ

ప్రజాశక్తి-అనకాపల్లి : నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కుకు 1270.80 ఎకరాలకు భూ సేకరణ నిమిత్తం బుధవారం జరిగిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా నిర్బందం ప్రయోగించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా బల్క్ డ్రగ్ పార్కు నిర్మాణ యోచనను విరమించుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు గురువారం జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. ప్రజల జీవనానికి హానికలిగించే బల్క్‌డ్రగ్ పార్కు ప్రతిపాదనలను విరమించుకోవాలని ఈనెల 4న వినతిపత్రం అందించిన విషయాన్ని వారు లేఖలో గుర్తు చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ సభలో తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు సభా వేదిక వద్దకు వెళ్ళిన సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథాన్ని లోనకి వెళ్ళనివ్వలేదని, గేటు వద్ద నుంచే పోలీసులు చుట్టుముట్టి ఈడ్చుకొని వెళ్ళి బలంతంగా వ్యాన్‌లో పడేసి ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్‌కు తరలించి సాయంత్రం 6 గంటల వరకు స్టేషన్‌లోనే నిర్భందించారని పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజులను ఆగస్టు 5 సాయంత్రం నుండే గృహ నిర్బంధం చేశారన్నారు. ఎస్.రాయవరం మండల సిపిఎం నాయకులు మోర్తా సత్యనారాయణ తెల్లవారు జామున షార్ట్ టీషర్టుతో జాగింగ్‌కు వస్తే ఆయన్ను కారులో ఎక్కించుకొని వేరు వేరు ప్రాంతాలు తిప్పారని, కనీసం డ్రెస్ మార్చుకోవడానికి అవకాశం కల్పించలేదని తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్ ఇంట్లోకి నక్కపల్లి ఎస్ఐ చొరబడి దుర్భాషలాడి ఇంట్లో ఉన్న గోడకు తలను గుద్దారని, అదేమని అడిగిన వారి తల్లిదండ్రులను, చెల్లిని బలవంతంగా లాగి ఈడ్చి పడేశారని, సెల్‌ఫోన్ లాక్కొని కిందపడేసి కాళ్లతో తొక్కేశారని పేర్కొన్నారు.

నక్కపల్లి మండలంలోని నిర్వాసిత గ్రామాల నాయకులను పోలీస్ స్టేషన్స్‌కు పిలుపించుకొని పోలీసులు బెదిరించారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాజయ్యపేటలో వందలాది మంది పోలీస్ బలగాలను మోహరించి కవాతు నిర్వహించి నిర్వాసిత ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. ఇన్ని నిర్భందాలు నడుమ ప్రజానీకం ప్రజాభిప్రాయ సేకరణ సభకు స్వచ్ఛందంగా వచ్చి బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ తమ అభిప్రాయాలను చెప్పడం జరిగిందని తెలిపారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం ప్రజాభిప్రాయ సేకరణలో స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు చెప్పుకునే హక్కు వుందని, రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 19 (ఎ), 21 ప్రకారం స్వేచ్ఛగా మాట్లాడే, జీవించే హక్కు ఉందని, వీటన్నింటిని తుంగలో తొక్కి పోలీసులు భయానక వాతావరణం సృష్టించి ప్రజల గొంతు నొక్కడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అవుతుందని పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ జోక్యం చేసుకొని నిర్బందం ప్రయోగించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు.

బల్క్ డ్రగ్ ప్రజాభిప్రాయసేకరణలో అరెస్టులపై నిరసన

ప్రజాశక్తి-దేవరపల్లి : నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్ భూ సేకరణ కోసం బుధవారం జరిగిన ప్రజాభిప్రాయసేకరణ సందర్భంగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, సిపిఎం, ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేయడంపై సిపిఎం ఆధ్వర్యాన మండలంలోని కోడపల్లి గ్రామంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బిటి.దొర మాట్లాడుతూ తమ పాంతంలో భూ సేకరణ చేపట్టొద్దని, భూములు ఇవ్వబోమని అనేక రూపాల్లో ప్రజలు పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ఆ ప్రాంతాన్ని కాలుష్య భరితం చేశారని, మత్స్యకారులు, స్థానిక ప్రజల జీవనోపాధిని దెబ్బతీశారని, నిర్వాసితులకు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చలేదని పేర్కొన్నారు. అందువల్ల బల్క్ డ్రగ్ పార్క్‌కు భూమిలిచ్చేది లేదని ప్రజలు స్పష్టం చేస్తున్నారని, వారి అభిప్రాయాన్ని గౌరవించకుండా

కోడపల్లిలో నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు, గిరిజనులు

ప్రభుత్వం బలవంతంగా భూ సేకరణ చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఈరట దేముడు, పంది మహాలక్ష్మి నాయుడు, మజ్జి సత్యారావు, కథల రాము, ఎరుట గోపాలుడు పాల్గొన్నారు.